



ఆసరా.. అంతేనా?



కోడ్‌తో లబ్ధిదారుల్లో ఆందోళన

- రెండు నెలలైనా ఊసే లేని రుణమాఫీ
- 70 వేల మందికి ఒకరిద్దరి ఖాతాల్లోనే నగదు
- బటన్ నొక్కి రోజులు గడుస్తున్నా అందని లబ్ధి

విడతల సంక్షేమం వాయిదాల పర్వంలో సాగింది. ఏకంగా ముఖ్యమంత్రి బటన్లు నొక్కుతున్నా సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగద గగనమవుతోంది. డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిని అందజేస్తున్నామని చెప్తున్నా.. లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరగ డం సర్వసాధారణంగా మారుతుంది. సంక్షేమ పథకాల అమలే మా అజెండా అని చెప్పకుం టున్న ప్రభుత్వం ఆచరణలో లబ్ధిదా రులను మోసం చేస్తోంది. ప్రధానంగా మహిళలకు చేయూత అందించే పథకాల్లో తన పని తనం చూపిస్తోంది. ఉత్తుత్తి బటన్లు నొక్కి ముఖ్యమంత్రి ఏమార్చుతున్నారని లబ్ధి దారులు మండిపడుతున్నారు. ముఖ్య మంత్రి బటన్ నొక్కారు కదా మన ఖాతా ల్లో నగదు జమై ఉంటుందని ఆశగా బ్యాం కులకు వెళ్తున్న మహిళలకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది.

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అర్హత పొందిన మహిళలు 7 లక్షల మంది ఉన్నారు. వారికి ప్రభుత్వం నాలుగు దఫాలుగా 2,800 కోట్ల రూపాయలు రుణమాఫీ కింద నగదు చెల్లించాలి. కాగా పథకాన్ని ఆలస్యంగా మొదలుపెట్టడం, అమలులో వాయిదాల మధ్య దూరం పెంచడం కారణంగా ఐదేళ్లలో మూడు సార్లు మాత్రమే రుణమాఫీ చేసింది. తాజాగా ఈ ఏడాది జనవరి 23న నాలుగో విడత ఆసరా పథకానికి ముఖ్యమంత్రి బటన్ నొక్కినా రుణమాఫీ నగదు మాత్రం లబ్ధిదారులందరికీ అందలేదు. నాలుగో విడత రూ.700 కోట్ల రుణమాఫీ జరగాలి. బటన్ నొక్కి రెండు నెలలు కావస్తున్నా మెజారిటీ లబ్ధిదారులకు ఆసరా రుణమాఫీ డబ్బులు పడలేదు. గడిచిన రెండు నెలల్లో అక్కడక్కడా చెదురుమదురుగా ఆసరా డబ్బు పడినా, ఆ తర్వాత ఆగిపోయింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. దీనికి తోడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో లబ్ధిదారుల్లో మరింత కలవరం కనిపిస్తోంది.

● చేయూత పథకంలో జాప్యం

చేయూత పథకాన్ని ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో జాప్యం చేసుకుంటూ వచ్చింది. మరో వారం రోజుల్లో ఎన్నికల నగారా మోగుతుందనగా మార్చి 7న ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. 2023 సెప్టెంబరులో ప్రా రంభిస్తామన్న పథకం ఆ తర్వాత నవంబరుకు, అక్కడ నుంచి డిసెంబరుకు, ఆపై జనవరికి వాయిదా పడి చిట్టచివరకు మార్చిలో ప్రారంభానికి నోచుకుంది. కానీ దీనికి సంబంధించి లబ్ధిదారుల్లో చాలా మందికి నగదు జమ కాలేదు. పథకానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు లేవు. దీంతో ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేస్తోంది. గడిచిన రెండు వారాల్లో మూడు జిల్లాల్లో మూడో వంతు మందికి కూడా చేయూత దక్క లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఎక్కడో ఒకరికి నగదు పడితే తమకు కూడా నగదు జమైందే మోనన్న ఆశతో లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు పదేపదే వెళ్తున్నారు. కానీ నగదు మాత్రం వారికి దక్కలేదు.

● కోడ్ వచ్చినా పంపిణీలో మతలబేంటి ?

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కూడా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడమే అధికార వైసీపీ ఎత్తుగడగా కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను నిర్వహించడం సాంకేతికంగా తప్పు. దీంతో ప్రభుత్వం ఎన్నికల ముందు పథకాలన్నింటినీ హడావుడిగా ప్రారంభించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమయ్యేలా దశల వారీగా నగదు విడుదల చేస్తూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తోందా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎన్నికల సంఘం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



ఆది నుంచి ఆలస్యం

అధికారంలోకి వచ్చిన తొలి ఆరు నెలల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తే అది జగన్ ప్రభుత్వం అని డప్పాలు కొట్టుకునే వైసీపీ నేతలు ఆది నుంచి ఆసరా, చేయూత పథకాలను జాప్యం చేస్తూనే వచ్చారు. అధికారం చేపట్టిన ఏడాదిలో పథకాలను ప్రారంభించకుండా దాదాపు 15 నెలల తర్వాత తీరిగ్గా పథకాలను ప్రారంభించారు. విడతల వారీ అమలు పేరుతో ప్రతి విడతలో మరింత జాప్యం చేస్తూ పథకాన్ని నీరుగార్చారు. సవాలక్ష ఆంక్షలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టారు. దొంగ లెక్కలు చూపి అర్హులు అనేకమందిని పథకానికి దూరం చేశారు.

నేతన్నపై.. నిర్లక్ష్యం

నేతన్నలు.. అబ్బుర పరిచే వస్త్ర కళా నైపుణ్యం వారిది. సమస్యలతో దశాబ్దాలుగా పోరాటం చేస్తూ అతికష్టంగా మనుగడ సాగిస్తున్నారు. వేల ఏళ్ల చరిత్ర ఉన్నా.. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి. రెక్కలిరిగేలా.. కీళ్లు అరిగేలా చాకిరి చేస్తున్నా.. ఐదు వేళ్లూ నోటికెళ్లని పరిస్థితి వారిది. వారి చేతి వేళ్లలో ప్రపంచాన్ని అబ్బుర పరిచే వస్త్ర కళా నైపుణ్యం ఉన్నా వారి బతుకులు మాత్రం మారడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక చేనేత కార్మికులు కోలు కోలేనంతగా దెబ్బ తిన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఒక రిద్దరికి పదో పరకో చిల్లర రాల్చిన ప్రభు త్వం చేనేత సంరక్షణ చర్యలను పూర్తిగా పక్కన పెట్టింది. ఫలితంగా చేనేత వృత్తి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

- తాయిలాలతో సరి.. చేనేతకు ఉరి
- వృత్తి రక్షణను వదిలేసిన పాలకులు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైపోతున్న నేతన్నలు
- వైసీపీ పాలనలో ఘోరంగా పతనమైన పరిశ్రమ
- అప్పుల భారం, ఆకలిచావుల దశకు చేరిన పరిశ్రమ

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగం చేనేత. దేశంలోనే అతిపెద్ద చేనేత ప్రాంతంగా బాపట్ల జిల్లా చీరాల- వేటపాలెం గుర్తింపు పొందింది. ఈ మూడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 30 వేల మగ్గాలున్నాయి. వాటిపై లక్ష మందికి పైగా చేనేత కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. బాపట్ల జిల్లాలోనే దాదాపు 17వేల చేనేత మగ్గాలున్నట్లు చేనేత జౌళిశాఖ లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మరో 13 వేలకు పైగా మగ్గాలు నమోదై వున్నాయి. బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, చెరుకుపల్లి, వలపర్ల, రేపల్లె, పేటేరు, భట్టిప్రోలు, ఇసుకపల్లి, రాజోలు, కనగాల మొదలు గుంటూరు జిల్లాలోని మంగళగిరి చుట్టుపక్కల గ్రామాలు, తెనాలి, పొన్నూరు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, గణపవరం, తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. స్వయంపోషకంగా ఉన్న ఈ రంగానికి కొద్దిపాటి ఊతం ఇస్తే సరిపోతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన చేయూతను కూడా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చేనేత పరిశ్రమ ఘోరంగా దెబ్బతింది. దీంతో చాలా చోట్ల చేనేత మగ్గాలే కనుమరుగై పోయాయి. 2020లో కరోనా నివారణ కోసం చేపట్టిన లాక్‌డౌన్ చేనేత కార్మికుల వృత్తికి లాక్‌డౌన్‌గా పరిణమించాయి. ఆనాటి నుంచి ఈనాటి వరకూ చేనేత కార్మికులకు చేసేందుకు పని దొరకని పరిస్థితి.

టీడీపీ హయాంలో ఊరట

గతంలో టీడీపీ ప్రభుత్వం చేనేత సంరక్షణకు నూలు, రంగులపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయ నిధి, పొదు పు నిధి, రంగుల కోసం రూ.25 కోట్లు, మూల ధనం కింద రూ.30 కోట్లు, మరమగ్గాలకు రాయితీ కింద రూ.80 కోట్లు కేటాయించి ఖర్చు చేశారు. కుటుంబా నికి 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు, 50 ఏళ్ల దాటిన లక్షా 11 వేల మంది చేనేతలకు 2వేలు చొప్పున పింఛన్లు అందజేశారు. ఇవి చేనేత పరిశ్రమ ను రక్షించడానికే కాకుండా, కార్మికులకు వ్యక్తిగతంగా కూడా కొంత ఊరటనిచ్చేవి. అయితే వైసీపీ ప్రభుత్వం టీడీపీ హయాంలో అమలైన పథకాలనన్నింటినీ రద్దు చేసేసింది. దీంతో చేనేత కార్మికులకు గడ్డిపోచ సాయం కూడా వారికి లభించలేదు. చేనేత వస్త్రాలకు దేశంలోనే కాదు.. ప్రపంచంలో కూడా అంతులేని ఆదరణ ఉంది. నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. ఈ రెండింటినీ సమన్వయం చేసే ప్రభుత్వ ఆదరణే పరిశ్రమకు కరువైంది. కార్మికుల ఉపాధి విషయాన్ని గాలికి వదిలి వైసీపీ ప్రభుత్వం కేవలం తాయిలాలకే పరిమితమైంది. రూ.2.97 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 200 కోట్లు మాత్రమే కేటాయించారు. అది కూడా చేనేత జౌళిశాఖ ఉద్యోగుల జీతాలకు, నేతన్న నేస్తానికి కూడా సరిపోదు. అంతలా గడిచిన ఐదేళ్లలో చేనేత నిర్లక్ష్యానికి గురైంది. లక్షమందికిపైగా ఉన్న చేనేత కార్మికుల్లో 10 వేల మందికి నేతన్న నేస్తం ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ఈ లబ్ధి పొందేవారిలో చేనేత రంగంలోని అట్టడుగువర్గమైన సొంత ఇల్లు, సొంత మగ్గం లేని షెడ్డు కార్మికులు మాత్రం ఉండరు. కొద్దోగొప్పో సొంత ఇల్లు, సొంత మగ్గం ఉన్న కార్మికులకు మాత్రమే ప్రభుత్వం నేతన్న నేస్తం అందిస్తోంది. ఫలితంగా చేనేత కార్మికుల పరిస్థితి గడిచిన నాలుగేళ్లలో కోలుకోలేనంతగా దెబ్బతినిపోయింది.



చీరాలలో బూజుపట్టిపోయిన చేనేత మగ్గాలు

చేనేతకు చేయూత పేరుతో లోకేశ్ కృషి

చితికి పోతున్న చేనేతను సంరక్షించేందుకు టీడీపీ యువనేత నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో కొంత ప్రయత్నం చేశారు. నేతన్నలకు అధునాతన యంత్ర సామగ్రిని అందించడంతోపాటు, సమస్యల మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నేతన్నలకు ఉపకరించే అధునాతన రాట్నాలు, మరమగ్గాలు అందజేస్తున్నారు. మంగళగిరి పరిధిలో ఉన్న ప్రముఖ చేనేతకారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్ షిప్ తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ మేరకు పలు సంస్థల అధినేతలు, ఎన్‌ఆర్‌ఐల సహకారం తీసుకుంటున్నారు.

చేనేతను రక్షించాలి

చేనేతను రక్షించకపోతే కార్మికులకు ఆకలిచావులే శరణ్యం. నాలుగేళ్లుగా చీరాల పరిసర ప్రాంతాల్లో చేనేత కార్మికులకు పనిలేదు. నేతన్న నేస్తం కొద్దిమందికే ఇస్తున్నారు. కార్మికులకు పని కల్పిస్తే నేతన్న నేస్తం లేకపోయినా హాయిగా బతుకుతారు. కానీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోవడంలేదు. పనిలేని కారణంగా చాలా మంది టీస్టాళ్లు, హోటళ్లలో కప్పులు కడిగే పనికి పోతున్నారు.



- జి. సుబ్బారావు, చేనేత నాయకుడు

అయ్యో.. రామా?

- కోదండరామునికి రూ.అర కోటి బకాయి
- మాజీ ఎమ్మెల్యే ఆమంచి సమీప బంధువు స్థలం లీజు
- 27 నెలలుగా అద్దె పెండింగ్.. అయినా షాపింగ్ మాల్ ప్రారంభం



వాడరేవులోని కోదండరామాలయ దేవస్థానం

చీరాల, మార్చి 19: చీరాల మండలం వాడరేవులోని కోదండరామాలయానికి రూ.లక్షల్లో అద్దె బకాయిలు చెల్లించాలి.. అయినా లీజుకు తీసుకున్న స్థలంలో షాపింగ్ మాల్ నిర్మించారు.. గత వారం ఆ మాల్‌ను ప్రారంభించారు. 27 నెలలుగా అద్దె చెల్లించకపోయినా నోటీసులతో అధికారులు సరిపుచ్చుతున్నారే కాని బకాయి వసూళ్లపై దృష్టి సారించకపోవడంపై భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోదండ రామా లయానికి చీరాల కూరగాయల మార్కెట్ పక్కన రూ.కోట్ల విలువైన 27.50 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని నిబంధనల మేరకు లీజుకు ఇచ్చేందుకు దేవదాయశాఖ సంకల్పించింది. 2020 నవంబరు 16న ఆ స్థలం అద్దెకు సంబంధించి బహిరంగ వేలం జరగ్గా వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ మేనల్లుడు శివప్రసాద్ నెలకు రూ.1.97 లక్షలు అద్దె చెల్లించే విధంగా హెచ్చుపాటపాడి దక్కించుకున్నారు. నిబంధనల మేరకు 11 సంవత్సరాల పాటు అద్దె దారుడు అందులో కొనసాగవచ్చు. నిబంధనల మేరకు ముందస్తుగానే పాటదారుడు ఒక సంవత్సరం కాలానికి రూ.23.64 లక్షలు చెల్లించారు. ఆ తర్వాత తాము తీసుకున్న స్థలానికి రెండు వైపులా దారి ఉండాలని, వెనుక వైపు నుంచి కూడా దారి కల్పించాలని కోరుతూ లీజుదారుడు కోర్టును ఆశ్రయించారు. అయితే అద్దె బకాయి నెల కు రూ.1.97 లక్షలు చొప్పున 27 నెలలకు రూ.అర కోటికి పైగా బకాయి ఉందని దేవదాయశాఖ వర్గాలు చెప్తున్నాయి. అయినా అద్దె చెల్లించకుండానే ఈ ఖాళీ స్థలంలో నిర్మించిన షాపింగ్ మాల్ గత వారంలో ఆమంచి ప్రారంభించారు.ఈ పరిస్థితుల్లో అద్దె బకాయిలు ఎప్పటికి ఆలయ ఖజానాకు సమకూర తాయా లేదా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్(ఫైల్)

నోటీసు పంపుతున్నాం..

ఆలయానికి చెందిన స్థలాన్ని నెలకు రూ.1.97 లక్షలు చెల్లించేలా కంకట శివప్రసాద్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాం. అద్దె బకాయి ప్రస్తుతం రూ.అర కోటి పైగా ఉంది. బకాయి చెల్లించాలని గతంలో మూడు పర్యాయాలు అప్పటి ఈవో నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత నేను బాధ్యతలు తీసుకున్నాక రెండు పర్యాయాలు నోటీసులు పంపాం. తాజాగా మరో మారు నోటీసు పంపుతున్నాం. ప్రస్తుతం వివాదం కోర్టులో నడుస్తోంది.

- జీవీఎల్ కుమార్, ఈవో, చీరాల



● శింగరకొండలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం

23 నుంచి శింగరకొండ తిరునాళ్ల

అద్దంకి, మార్చి 19: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభమై 25వ తేదీతో ముగియనున్నాయి. 23వ తేదీ ఉదయం 6-30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన, ఉదయం 9 గంటలకు ధ్వజ స్తంభ నిర్మాణదాత మేదరమెట్ల శంకరారెడ్డిచే జీవ ధ్వజ పూజ, ఉష్ట్ర వాహన పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరగనున్నాయి. 10 గంటలకు భజన, రాత్రి 7 గంటలకు తోలుబొమ్మలాట, కోలాట ప్రదర్శన జరగనున్నాయి. 7 గంటలకు గజవాహన సేవ జరుగుతుంది. 24 ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 5-30 గంటలకు బిందె తీర్థం, 6 గంటలకు విశేష అభిషేకం జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు భజన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు దేవనర్తకి పూర్తి నాటకం, కోలాట ప్రదర్శన, రాత్రి 7 గంటలకు ఉష్ట్ర వాహన సేవ జరుగుతుంది. 25వ తేదీ సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన, భజన, కూచిపూడి నృత్య ప్రదర్శన, స్వామి వారి రథోత్సవం ఉంటుందని ఈవో సుభద్ర తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రంగుల రాట్నాలు, జెయింట్ వీల్స్ నిర్వాహకులు ఇప్పటికే శింగరకొండ చేరుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొత్త విద్యుత్‌లైన్లు, అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమైన తర్వాత మొట్టమొదటి సారిగా ఈ ఏడాది మూలవిరాట్ ఉన్న ఆలయంలో కాకుండా బాలాలయంలో స్వామి వారి దర్శనం జరుగుతుంది. ముఖ మండపం నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో ఉత్సవాలు కూడా బాలాలయంలో నిర్వహిస్తున్నారు.



సిద్ధం చేస్తున్న రంగుల రాట్నాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ప్రభుత్వ స్థలాల్లో ప్రచారాలకు అనుమతిలేదు

బాపట్ల, మార్చి 19: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారాలకు ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం జిల్లా అధికారులకు ఆయన పలుసూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచాలన్నారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని విస్తృత స్థాయిలో వినియోగించాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు పర్చడంలో రాజీపడవద్దన్నారు. ప్రభుత్వ ప్రాంగణాలు, వాణిజ్యసంస్థలలో రాజకీయప్రకటనలకు సంబంధించిన హోర్డింగ్‌లు, పోస్టర్‌లు, బ్యానర్లను అనుమతించరాదన్నారు. రాజకీయపార్టీలకు నూతన అనుమతులు ఇచ్చే అంశంలో అందరికీ సమానహక్కులు, అవకాశాలు, పరిమితులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలూ.. బేఖాతర్

● సీఆర్‌జడ్ పరిధిలో ఆగని అక్రమ కట్టడాలు

- అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై విచారణకు కమిటీ
- అక్రమార్కులకు వరంగా శాఖల మధ్య సమన్వయ లోపం

వేటపాలెం(చీరాల), మార్చి 19: కలెక్టర్ దృష్టి సారించినా తగ్గేదేలే అని అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామాపురం, చీరాల మండలం వాడరేవు, విజయలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో తీరం వెంట సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలే ఇందుకు నిదర్శనం. స్థానికంగా, స్థానికేతరంగా ఉన్న రాజకీయ పలుకుబడి నేపథ్యంలో సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇటీవల కలెక్టర్ రంజిత్ బాషా సీఆర్‌జెడ్‌లో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారిని ఒక కమిటీగా సీఆర్‌జెడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లకు సంబంధించి నివేదిక తయారు చేసి అందజేయాలని ఆదేశించారు. ఆ తర్వాత కూడా అక్రమ కట్టడాలు ఆగలేదు సరికదా మరింత ఊపందుకున్నాయి. సీఆర్‌జెడ్ పరిధిలోని అక్రమ కట్టడాలు, అనధికారిక లేఅవుట్లకు సంబంధించి కలెక్టర్ నియమించిన కమిటీ ఏం చేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ కమిటీ నివేదికపై అంతిమంగా కలెక్టర్ ఎలా స్పందిస్తారనే అంశంపై తీర ప్రాంతంలో సర్వత్రా చర్చ జరుగుతోంది.

నిర్మాణాలకు అనుమతులు ఎలా?

ఏదన్నా నిర్మాణం చేపట్టాలంటే సంబంధిత శాఖల నుంచి పూర్తిస్థాయి అనుమతులు తప్పనిసరి. అయితే ఆ నిబంధన సామాన్యులకే కాని అక్రమార్కులకు కాదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. సీఆర్‌జెడ్ పరిధిలో జరిగే నిర్మాణాలకు పంచాయతీ, ఓడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అప్రూవల్ ఉండాలి. అదే రిసార్ట్స్ అయితే సుమారు 11 రకాల అనుమతులు ఉండాలి. అప్పుడే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి. అయితే కొందరు ఒకచోట అనుమతి పొంది అక్కడ నుంచి అనుమతి లేని ప్రాంతానికి కూడా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారు ఉన్నారు. విద్యుత్ లైన్‌పై తీగలు కలిపి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నా ఆ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. శాఖల మధ్య సమన్వయ లోపం కూడా అక్రమార్కులకు వరంగా మారుతోంది.



కఠారివారిపాలెం సమీపంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం

పరిశీలించి నోటీసులు అందజేస్తాం

సీఆర్‌జెడ్ పరిధిలో జరిగే నిర్మాణాలకు పంచాయతీ పరంగా ఎవరికీ అనుమతి లేదు. వారికి ఓడా నుంచి ఏ అనుమతులు ఉన్నాయో తెలీదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - శివలీల, సెక్రటరి, చల్లారెడ్డిపాలెం

విద్యుత్ కనెక్షన్ ఇవ్వం

అనుమతి లేని కట్టడాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరగదు. నిర్ణీత అనుమతులు పొందిన కట్టడాలకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ ఇస్తాం. విద్యుత్ లైన్‌పై వైర్లు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారికి చర్యలు తప్పవు.

- జాన్‌థామస్, ట్రాన్స్‌కో డీఈఈ, చీరాల

దిక్సూచి DIKSUCHI

ప్రవాళ బిత్తికలు

ప్రవాళ బిత్తికలు(Coral Reefs) అనేవి సముద్రాలలో ఆయన రేఖా మండలాలలో నివసించే ప్రవాళ కీటకాలు(Coral Polyps) లేదా పగడపు పురుగులతో నిర్మితమైనవి. ఈ కీటకాలు సముద్రాలలో ఉండే కాల్షియం కార్బోనేట్‌ను గ్రహించి తమ కర్పరాల(Shells)ని నిర్మిస్తాయి.

ప్రవాళ కీటకాలు వివిధ రంగులలో ఉంటాయి. పచ్చ, పసుపు, గులాబి, తెలుపు, ఊదా మొదలైనవి. ఈ కీటకాలు గుంపులు గుంపులుగా, కాలనీలుగా నివసిస్తాయి. ఇలాంటి కాలనీలు పెరుగుతూ ఒక దానితో ఒకటి పెనవేసుకుని ప్రవాళ బిత్తికలుగా, ప్రవాళ ద్వీపాలుగా ఏర్పడతాయి. ప్రవాళ బిత్తికలు, దీవులు కేవలం ప్రవాళ కీటకాలతో ఏర్పడలేదు. ఇతర సముద్రాంతర్గత జీవులు కూడా వీటి నిర్మాణానికి తోడ్పడతాయి. అందులో ముఖ్యమైనవి సున్నపు ఆల్గే(Calcareous algae) ఫోరమినిఫెరా (Foraminifera), ఎఖైనోడర్మ్స్(Ech-inoderms) మొదలైనవి.

- వీటి ముఖ్య ఆహారం కాల్షియం కార్బోనేట్. ఇది కొరవడిన ప్రాంతాలలో వీటి పెరుగుదల కృశించి పోతుంది. కాబట్టి ఇవి ఇతర సూక్ష్మ సముద్ర జీవరాశుల నుంచి గ్రహించి తమ కర్పరాలను నిర్మిస్తాయి. ప్రవాళ కీటకాలు తమ గూళ్ల(Reef) ఉన్న చోటు నుంచి కదలవు. తమని తాకుతూ దాటివెళ్లే నీటి నుంచే ఆహారాన్ని గ్రహిస్తాయి. కాబట్టి నీటి చలనం అవసరం. మిత వేగ ప్రవాహాలు ఉన్న ప్రాంతాలలో ఇవి పెరుగుతాయి. నిలకడగా ఉన్న నీరు వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- మంచి నీటి ప్రాంతాలలో ఈ కీటకాలు నివసించవు. అధిక వర్షపాతం, నదీజలాల ప్రవేశం మొదలైనవి వీటి పెరుగుదలకు ప్రతి బంధకాలు.

ప్రవాళ కీటకాలు 55 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నివసించలేవు. అనేక బిత్తికలు సముద్రాలలో సుదూరంగా ఏర్పడి ఉంటాయి. ఇవి ఏర్పడటానికి అక్కడి సముద్రాంతర్గత ఉపరితలాలందు రెడ్జ్‌లుగాని, ఉబ్బెత్తు శిఖరాలు గాని ఉన్న వాటిపై ఇతర జీవరాశులు నివసించి 55 మీటర్ల లోతు వరకు వ్యాప్తి చెందినప్పుడు, ఆపై ప్రవాళ కీటకాలు సమూహ నివాసమేర్పరచుకుంటాయి. ఈ కీటకాల పెరుగుదల సముద్ర ఉపరితలం వరకే వ్యాప్తి చెందుతుంది. ఉపరితలంపైన పెరిగిన బిత్తికలలోని కీటకాలు మరణించి వీటి కర్పరాలు బిత్తికలో కలుస్తాయి.

తీరం వైపున ఉన్న కీటకాలకు ఆహార లేమి వల్ల ఇవి క్షీణించి లాగూన్లు ఏర్పడటానికి కారణమవుతున్నాయి. బిత్తికి నిర్మాణం ఒక ద్వీపం చుట్టూ ఏర్పడినట్లయితే మధ్యలో చక్రాకార లాగూన్ ఏర్పడుతుంది. దీన్ని అటోల్ అంటారు.

బిత్తికల రకాలు: ప్రవాళ బిత్తికల ఆకారం, నిర్మాణం, ఉనికిని బట్టి మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి తీరాంచల బిత్తిక(Fringing Reef), అవరోధక బిత్తిక(Barrier Reef), అటోల్(Atoll)

తీరాంచల బిత్తిక: ఇవి ఖండ తీరానికోగాని, ద్వీపానికో గాని అంటుకొని తీరపు అంచున మాత్రమే ఏర్పడతాయి. వీటి ఉపరితలం గరకుగాను, ఎగుడు దిగుడుగాను ఉంటుంది. దీని వెలుపలి అంచు సముద్రంలోనికి వాలుగా ఉంటుంది. సముద్రమట్టం వరకు పెరిగిన ప్రవాళ కీటకాలకు తీరం వైపు ఆహార సమృద్ధి లేనందు వల్ల క్రమంగా క్షీణించి లాగూన్‌లు ఏర్పడతాయి. వెలుపలి అంచున ఉన్న కీటకాలకు సముద్ర జలాల నుంచి సమృద్ధి ఆహారం లభించడం వల్ల బాగా, ఏపుగా పెరుగుతాయి. తీర ప్రాంతపు వైపున ఉన్న కీటకాలు నదీజలాల సమ్మేళనం వల్ల బురదనీటి ప్రవేశం వల్ల క్షీణించి లాగూన్ ఏర్పడటానికి కారణమవుతాయి. ఈ విధంగా ద్వీపాన్ని గాని, తీరాన్ని గాని అంటుకొని తీరంవైపు లాగూన్ గల ప్రవాళ బిత్తిక సముదాయాన్ని తీరాంచల బిత్తికలు అని పేర్కొంటారు. ఉదాహరణకు.. లక్ష దీవులు, కార్ నికోబార్ దీవులు. ఫ్లోరిడా తీరంలో, న్యూహెబ్రిడీస్ దీవులలో ఉన్నవి చెప్పుకోదగ్గవి.



పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

అవరోధ బిత్తికలు: అతి పెద్దదైన, విస్తారమైన బిత్తికలలో ఇవి ముఖ్యమైనవి. తీరానికి దూరంగా ఏర్పడి లోతు విస్తీర్ణంలో తీరాంచల బిత్తికల కంటే అధికంగా ఉంటాయి. వెలుపలి వైపు ఇవి సముద్రంలోనికి ఎక్కువగా వాలు కలిగి ఉంటాయి. లాగూన్ వెడల్పు అధికంగా ఉండి, తీరం నుంచి సుమారు 10 నుంచి 180 కి.మీ. వరకు ఉంటుంది. 'ఆస్ట్రేలియా గ్రేట్ బారియర్ రీఫ్' దీనికి మంచి ఉదాహరణ. ఈ బిత్తిక ఆస్ట్రేలియా ఖండపు తూర్పున క్వీన్లాండ్ తీరాన 1900 కి.మీ. పొడవు, 160 కి.మీ. వెడల్పున వ్యాపించి ఉంది. ఇది ఉత్తరాన తీరం నుంచి 128 కి.మీ. దూరం వరకు, దక్షిణాన 11 కి.మీ. దూరం వరకు విస్తరించి లాగూన్‌తో కూడి ఉంది. తీరానికి బిత్తికకు మధ్య సముద్రం ప్రశాంతంగా ఎక్కువ అలలు లేకుండా జలక్రీడలకు అనువుగా ఉంటుంది.

అటోల్: అటోల్ బిత్తికలో చక్రాకారంలో గాని, గుర్రపు నాళపు ఆకారంలో గాని ఉండి మధ్యలో లాగూన్ కలిగి ఉంటుంది. కొన్నింటిలో ఈ లాగూన్ మధ్య చిన్న ద్వీపం ఏర్పడుతుంది. చక్రాకారంగా ఉన్న బిత్తిక చుట్టూ కొన్ని చోట్ల ఖాళీలు ఏర్పడి, వాటికి వెలుపలి సముద్రంతో సంబంధం ఉంటుంది. నిర్దిష్టంగా ఏర్పడిన అటోల్‌కు చెందిన లాగూన్ మధ్యన ద్వీపం ఉండదు. అటోల్లు అధికం పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడ్డాయి. ఉదా:- తూర్పుఫిజీ అటోల్, పశ్చిమ కారోలినలోని ట్రుక్ అటోల్ మొదలైనవి. మాల్దీవ్ ద్వీపాలలో కూడా అనేక దీవులు అటోల్ ఆకారంలో ఉన్నవే.

భారతదేశం - పగడపు దిబ్బల విస్తరణ: భారతదేశంలోని పగడపు దిబ్బలు గల్ఫ్ ఆఫ్ కచ్(గుజరాత్), గల్ఫ్ ఆఫ్ మన్నార్(తమిళనాడు), పాక్ అఖాతం, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్ దీవులతో సహా చాలా ప్రాంతాల్లో కనిపిస్తాయి. వాయువ్య ప్రాంతంలోని గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రపంచంలో అత్యంత ఉత్తరంగా ఉన్న పగడపు దిబ్బలుగా పేర్కొంటారు. పగడపు దిబ్బల చిన్న చిన్న ముక్కలు రత్నగిరి(మహారాష్ట్ర), మాల్వాన్(మహారాష్ట్ర), రెడి(దక్షిణ బొంబాయి)లో, మంగళూరు(కర్ణాటక)కు పశ్చిమాన ఉన్న గవేషాని బ్యాంకు వద్ద కూడా కనిపిస్తాయి.



వి.వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

ప్రవాళ బిత్తికల పెరుగుదలకు కారణాలు

సాధారణంగా ప్రవాళ కీటకాలు ఆయన రేఖా మండల సముద్రపు నీటిలో విస్తారంగా నివసిస్తాయి. వీటి పెరుగుదలకు కొన్ని అనుకూల పరిస్థితులు అవసరం.

- ముఖ్యంగా ప్రవాళ కీటకాల పెరుగుదలకు ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ ఉండాలి. అధిక శీతల, అధిక ఉష్ణోగ్రతలలో ఈ కీటకాల పెరుగుదల కుంటుపడుతుంది.
- ఈ ప్రాణులకు అత్యవసరమైన సూర్యరశ్మి, ప్రాణ వాయువు(ఆక్సిజన్) 55 మీటర్ల లోతు వరకు మాత్రమే పుష్కలంగా ఉంటుంది. అందువల్ల వీటి పెరుగుదల 55 మీటర్ల లోతు వరకే పరిమితమై ఉంటుంది.
- ఉష్ణమండల ప్రాంత సముద్ర జలాలైన 30 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 30 డిగ్రీల దక్షిణ అక్షాంశాల మధ్య అధికంగా పెరుగుతాయి.
- స్వచ్ఛమైన ఉప్పునీరు పగడపు దిబ్బల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అయితే మంచినీరు, అధిక లవణీయత రెండూ ప్రవాళ కీటకాల పెరుగుదలకు హానికరం.
- సాధారణంగా ప్రవాళ బిత్తికలు ఆయన రేఖా ప్రాంతాలలో(Tropical regions) ఖండాల తూర్పు తీర ప్రాంతంలోనే కనిపిస్తాయి. ఖండాల పశ్చిమ తీర ప్రాంతాలలో చల్లని నీరు పైకి ఉబికి శీతల ప్రవాహాలుగా ప్రవహిస్తున్నందున ఉష్ణోగ్రత తగ్గి వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- స్వచ్ఛమైన ఉప్పునీరు ప్రవాళ కీటకాలు నివసించడానికి అవసరం. నదులు సముద్రాలలో కలిసేచోట ఒండ్రుమట్టితో నీరు బురదగా (Turbid waters) ఉండటం వల్ల నది ముఖ ద్వారాల వద్ద ప్రవాళ బిత్తికలు ఏర్పడవు.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/9qazLOk**లో చదవండి.**

కలినరీ ఆర్ట్స్‌లో బీబీఏ, ఎంబీఏ

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(ఐసీఐ)- బీబీఏ, ఎంబీఏ ప్రోగ్రాములలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి అమర్‌కంటక్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లు ఉన్నాయి. సీయూఈటీ(యూజీ/పీజీ) స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

బీబీఏ (కలినరీ ఆర్ట్స్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 120 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంపిక:** సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంబీఏ(కలినరీ ఆర్ట్స్): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి.

- **అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- **ఎంపిక:** సీయూఈటీ(పీజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(పీజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 25
- **ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ/పీజీ) తేదీ:** మే 26
- **వెబ్‌సైట్:** www.icitirupati.in

నవ్య | చిత్రజ్యోతి



గ్లాస్ అంటే సైజు కాదు... సైన్యం

పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. 'భగత్ బ్లేజ్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సినిమాలో పంచ్ డైలాగులు పవర్‌ఫుల్‌గా ఉన్నాయి.. తన రేంజ్‌ను విమర్శించే వారికి ఘాటుగా సమాధానం ఇస్తూ 'గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది.. గ్లాస్ అంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం' అంటూ పవన్‌కల్యాణ్ కౌంటర్ ఇవ్వడం గూస్ బంప్స్ తెప్పించింది. ఈ టీజర్‌లో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఆకట్టుకొనే బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో పవన్‌కల్యాణ్ క్యారెక్టర్‌కు ఎలివేట్ చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆయనంక బోస్, స్క్రీన్‌ప్లే: కె.దశరథ్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.



వేదం కాంబినేషన్‌లో..

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చారు అనుష్క శెట్టి. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 50వ చిత్రం అధికారికంగా ఖరారైంది. ప్రయోగాత్మక చిత్రాలు తీసే క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ కృష్ణ రెడ్డి, రాజీవ్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రానికి 'ఘాటి' అనే టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. చీరతో ముఖాన్ని కప్పి ఎడారిలో ఒంటరి బాటసారిగా సాగుతున్న అనుష్కను ఇందులో చూపించారు. ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి బయటపడే కథగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది. అందులో వేశ్యగా నటించిన అనుష్క, ఈ చిత్రంలోనూ అదే పాత్ర పోషించనున్నారని టాక్ వినిపిస్తోంది.

జపాన్‌కు తీసుకొస్తా





రాజమౌళి

జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా దర్శకధీరుడు రాజమౌళి రూపొందించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం దేశవిదేశాల్లో విజయం సాధించింది. అలాగే ఇటీవల జరిగిన ఆస్కార్ వేడుకల సందర్భంగా గత ఏడాది ఆస్కార్ వేదికపై 'ఆర్ఆర్ఆర్' చిత్రం సృష్టించిన సందర్భాన్నా అందరూ మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా జపాన్‌లో కూడా విడుదలై విజయం సాధించింది. ఈ విజయాన్ని అక్కడి ప్రేక్షకులతో కలసి ఆస్వాదించడానికి రాజమౌళి ఇటీవలే జపాన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రేక్షకులతో మాట్లాడుతూ "నేను దర్శకత్వం వహించే నెక్ట్స్ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నటీనటుల ఎంపిక ఇంకా ఓ కొలిక్కి రాలేదు. కేవలం కథానాయకుడు మాత్రమే ఖరారు అయ్యారు. ఆయన పేరు మహేశ్‌బాబు. చాలా అందంగా ఉంటారు. త్వరలోనే ఈ సినిమాను మొదలుపెడ్తాను. సినిమా రిలీజ్ సమయానికి మహేశ్‌ను కూడా జపాన్ తీసుకువచ్చి మీకందరికీ పరిచయం చేస్తాను. మహేశ్‌ను కూడా కచ్చితంగా మీరందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

టెనెంట్ సందేశం



'పొలిమేర 2' చిత్రం ఘన విజయం తర్వాత సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు చక్కటి స్పందన వచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు థ్రిల్ చేసే అంశాలతో ఈ చిత్రం రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. 'ఈ తరం మహిళలు ఎంత జాగ్రత్తగా మెలగాలో ఈ చిత్రంలో చూపించబోతున్నాం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. ఏప్రిల్ మూడో వారంలో 'టెనెంట్'ను విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. మేఘా చౌదరి, చందన పయావుల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్. సినిమాటోగ్రఫీ: జెమిన్ జోమ్



దర్శక ధీరుడి సమర్పణలో...

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ నిర్మాతగా మారుతున్నారు. ప్రముఖ ఆర్కా మీడియా వర్క్స్ సంస్థ అధినేతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనితో కలసి కార్తికేయ రెండు క్రేజీ ప్రాజెక్ట్స్‌ను రూపొందించనున్నారు. పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి ఈ చిత్రాలకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సినిమా, సినిమాకు ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించే మళయాళ నటుడు, 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్ ఈ రెండు చిత్రాల్లోనూ నటిస్తుండటం విశేషం. కార్తికేయ ఈ మధ్య తెలుగులో డిస్ట్రిబ్యూటర్‌గా విడుదల చేసిన 'ప్రేమలు' చిత్రానికి ఫహాద్ ఫాజిల్ కూడా ఓ నిర్మాత అనే సంగతి తెలిసిందే. ఈ రెండు చిత్రాల్లో ఒకటి ఫ్రెండ్‌షిప్ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. దీనికి 'ఆక్సిజన్' అనే టైటిల్ ఖరారు చేశారు. నూతన దర్శకుడు సిద్ధార్థ్ నాదెళ్ల దర్శకుడు. మరో చిత్రం ఫ్యాంటసీ కథాంశంతో రూపొందుతోంది. ఈ చిత్రం టైటిల్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ ఏలేటి దర్శకుడు. ఈ రెండు చిత్రాలకు వేటికవే భిన్నంగా, కంటెంట్ బేస్డ్‌గా తెరకెక్కనున్నాయి. ఈ సినిమాలను ప్రకటించిన సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ "డిస్ట్రిబ్యూటర్‌గా నా తొలి చిత్రం 'ప్రేమలు' ద్వారా నాకు విజయాన్ని అందించి నాపై మీకున్న అపరిమితమైన ప్రేమను తెలియజేశారు. దీంతో మంచి చిత్రాలకు భాషాపరమైన భేదాలుండవనే నమ్మకం నాలో మరింతగా పెరిగింది. ఈ రెండు చిత్రాల్లో నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ బహుముఖ ప్రజ్ఞకు ప్రతిరూపం, నేనెంతగానో ఆరాధించే వ్యక్తి" అని అన్నారు.

కామెడీతో వేడి పుట్టిస్తాం




సుహాస్ హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'అందరూ మెచ్చే వినోదం ప్రారంభమవుతుంది. మీ క్యాలెండర్‌లో మే 24ని గుర్తు పెట్టుకోండి. మేం అద్భుతమైన కామెడీతో వేడి పుట్టించడానికి సిద్ధంగా ఉన్నాం' అని హీరో సుహాస్ వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో సుహాస్‌కి జతగా సంకీర్తన విపిన్ నటిస్తున్నారు. 'సలార్' చిత్రానికి డైలాగ్ రైటర్‌గా పని చేసిన సందీప్‌రెడ్డి బండ్ల ఈ సినిమాకు దర్శకుడు. మే 24న విడుదలయ్యే ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు చెప్పారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌ను చూస్తుంటే ఫ్యామిలీ ఎమోషన్స్ కలిగిన ఓ ఫన్నీ కోర్టు డ్రామా చిత్రమని అర్థమవుతుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, మురళీశర్మ, గోపరాజు, రఘుబాబు, పృథ్వీ, శివన్నారాయణ, రూపలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత. సమర్పణ: శిరీష్.

స్వేచ్ఛకు స్ఫూర్తి



సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. సూరపల్లి వెంకట రమణ దర్శకత్వంలో మాధవి తాలబత్తుల నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాశ్ పూరి చేతుల మీదుగా విడుదల చేశారు. కొత్త తరహా కాన్సెప్ట్‌తో తెరకెక్కిన 'మెర్సీ కిల్లింగ్' ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 స్ఫూర్తితో ఈ సినిమా కథ రూపొందించినట్లు దర్శకుడు తెలిపారు. స్వేచ్ఛ అనే అనాథ బాలిక న్యాయం కోసం జరిపిన పోరాటం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నిర్మాత చెప్పారు. సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: అమర్ జి.

సిద్ధమైన హనీ-బన్నీ



హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో సమంత, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ వెర్షన్‌కు రుస్సో బ్రదర్స్ దర్శకత్వం వహించగా, 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌తో పాపులర్ అయిన దర్శక ద్వయం రాజ్, డీకే ఇండియన్ వెర్షన్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయినా, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అవుతుందనే విషయంలో ఇంతవరకూ ఎటువంటి అప్‌డేట్ రాలేదు. మేకర్స్ మంగళవారం ఈ సిరీస్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేశారు. 'హనీ-బన్నీ' పేరుని ఖరారు చేశారు. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవనుంది. డేట్ మాత్రం ఇంకా ఫిక్స్ చేయలేదు. 1990ల నేపథ్యంలో సాగనున్న ఈ సిరీస్ అద్భుతమైన ప్రేమ కథతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్. దర్శక ద్వయం రాజ్, డీకే రూపొందించిన 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌లో నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను పోషించిన సమంత 'హనీ-బన్నీ సిరీస్‌కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ సిరీస్‌లో కేకే మీనన్, సిమ్రాన్, సోహమ్ మజుందార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఏడు గెటప్పుల్లో మంచు లక్ష్మి



లక్ష్మీ మంచు ప్రధాన పాత్ర పోషించిన సోషియో ఫాంటసీ 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఎం.ఎస్.కే నిర్మాత. ఈ పీరియాడిక్ డ్రామా తెలుగుతో పాటు పలు భాషల్లో విడుదలవుతోంది. తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ ఎస్. గిరిధర్ చేతుల మీదుగా 'ఆదిపర్వం' తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మంచు మాట్లాడుతూ 'పోస్టర్ చూస్తుంటే 'నేను ఇన్ని పాత్రలు చేశానా?' అనిపిస్తోంది. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది' అన్నారు. 'ఈ చిత్రానికి బలం, బలగం మంచు లక్ష్మి. ఆమె నటించకపోతే ఈ సినిమా లేదు. ఇందులో ఆమె ఏడు రకాల గెటప్స్ వేశారు. తన నట విశ్వరూపం చూస్తాం' అని దర్శకుడు చెప్పారు. శివ కంఠంనేని, ఎస్తర్ నోరోనా కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: మాధవ్, సంజీవ్. సినిమాటోగ్రఫీ: ఎస్ఎన్ హరీశ్

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/m6Ot446 లో చదవండి.


తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతిని కాపాడుకోవటం అందరి బాధ్యత

● మూడు ముక్కల ఆటతో విధ్వంసం తప్ప వికాసం లేదు

● 1554వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 19: రాష్ట్ర ఆదాయ వనరు అమరావతిని కాపాడుకోవటం అందరి భాధ్యత అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు విన్నవించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు మంగళవారం నాటికి 1554వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, సీఎం జగన్‌రెడ్డి ప్రతిపాదించిన మూడు రాజధానులతో విధ్వంసం తప్పితే వికాసం ఉండదన్నారు. అమరావతి రాజధాని రాష్ట్ర సంపద అని స్పష్టం చేశారు. అది తెలిసి కూడా అమరావతిని నాశనం చేయాలను కోవటం సీఎం జగన్‌రెడ్డి బుద్ధి తక్కువ పని అని పేర్కొన్నారు.ఉన్నత న్యాయస్థానం కూడా అమరావతిని అభివృద్ధి చేయాలని తీర్పునిచ్చిన సంగతి మర్చిపోవద్దని రైతులు హితవు పలికారు. అమరావతిని నాశనం చేసే ఏ పనినైనా అడ్డుకొని తీరతామన్నారు. రాజధానిని నాశనం చేయాలని గతంలో అనేక ప్రయత్నాలు వైసీపీ ప్రభుత్వం చేసిందన్నారు. ఆ చర్యలను నిలిపివేయాలని హితవుపలికారు. లేదంటే పాలకులకు తగిని గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. జై ఆంధ్రప్రదేశ్, బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. తుళ్ళూరు, వెంకటపాలెం, మందడం, వెలగపూడి, ఉద్దండ్రాయునిపాలెం, అనంతవరం నెక్కల్లు తదితర రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీ దిమ్మెలకే తెలుపు రంగు


టీడీపీ జెండా దిమ్మెకు వేసిన తెలుపు రంగు

కారంపూడి, మార్చి 19: అధికారులు సైతం పక్షపాతం చూపిస్తున్నారోమో అనిపిస్తోంది. మండలంలోని ఇనుపరాజుపల్లెల్లో వైసీపీ రంగులు ఉన్న జెండా దిమ్మెలు, విద్యుత్ పోల్స్‌ను వదిలేసి కేవలం టీడీపీ దిమ్మెలకే తెలుగు రంగులను పూశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. అధికారులు వైసీపీకి పక్షపాతం వ్యవహరిస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వైసీపీ రంగులున్న దిమ్మెలకు వేయని తెలుపు రంగు

సురక్ష పేరున.. ప్రచారం

● మే నెల వరకు క్యాంపులు నిర్వహించాలని పైస్థాయిలో ఆదేశాలు

● కోడ్ వచ్చినా సచివాలయాలు, ఆర్‌బీకేలకు ఆగని జగన్ పత్రిక

● తీవ్ర ఒత్తిడికి గురౌతున్న సచివాలయాల సెక్రెటరీలు

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ డే(మే 13వ తేదీ) ముగిసేంత వరకు ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించేందుకు సంబంధిత ట్రస్టు నుంచి నిత్యం ఆదేశాలు వెలువడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సచివాలయాల సెక్రెటరీలకు ట్రస్టు అధికారులు ఫోన్లు చేస్తూ మీ సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించాలని ఆదేశిస్తున్నారు. దీనిపై సెక్రెటరీలు అభ్యంతరం లేవనెత్తుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆరోగ్య సురక్ష శిబిరాలకు సంబంధించి వైద్య పరీక్షలకు వెళ్లినప్పుడు జగన్ బొమ్మతో ఉన్న ఒక సంచి, ఫైలు, మెడికల్ కేస్‌షీట్‌ని ఇస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ప్రస్తుత తరుణంలో దీని వలన తమకు ఇబ్బంది కలుగుతుందని చెబుతున్నా వాటి వరకు వేరే మెటీరియల్ పంపిస్తామని, ఎట్టిపరిస్థితుల్లో క్యాంపులు నిర్వహించాల్సిందేనని తమకు ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు అందుతున్నాయని సెక్రెటరీలు చెబుతున్నారు.

వాస్తవానికి డిసెంబరు/జనవరి నెలల్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతీ సచివాలయం పరిధిలో వైసీపీ ప్రభుత్వం క్యాంపులు నిర్వహించింది. ఈ క్యాంపులు ముఖ్యఉద్దేశ్యం వైద్య పరీక్షలు నిర్వహించి ఎవరికైనా ఆరోగ్య సమస్యలుంటే సంబంధిత ఆస్పత్రికి లింకు చేసి వైద్యం చేయించడమే. ఆ పనిని ఇప్పటికే పూర్తిచేశారు. ఎన్నికల కోడ్ మరికొద్ది రోజుల్లో అమలులోకి వస్తుందనగా మళ్లీ ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత శనివారం నుంచి కోడ్ అమలులోకి వచ్చిన దృష్ట్యా ఈ శిబిరాల నిర్వహణని నిలిపేయాలి. ఎవరికైనా అనారోగ్యంగా ఉంటే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకొంటారు. అయినప్పటికీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఆరోగ్య సురక్ష క్యాంపుల పేరుతో వైసీపీ ప్రభుత్వం కొత్త డ్రామా ఆడుతున్నది. ఈ క్యాంపుల నిర్వహణని నిలిపేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితమౌతున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

సీఎం జగన్ తన పత్రిక సర్క్యులేషన్‌ని పెంచుకొనేందుకు జిల్లాలోని ప్రతీ ఒక్క గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ప్రభుత్వ నిధులతో వాటిని గత కొన్ని ఏళ్లుగా అంటగడుతున్నారు. అలానే గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు వంటి వాటికి కూడా రెండేసి పేపర్లను వేయిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో 25 వేల వరకు జగన్ పత్రిక కాపీలను ప్రభుత్వ ఉద్యోగులు/కార్యాలయాలకు ఇస్తున్నారు. జగన్ పత్రికపై స్పష్టంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటో ఉంటుంది. అలాంటప్పుడు ఆ పత్రికని ప్రభుత్వ కార్యాలయాలకు వేయించడాన్ని అధికారులు నిలిపేయాలి. అలానే సిబ్బందికి కూడా నిలుపుదల చేయించాలి. ఈ విషయంలోనూ అధికారులు చర్యలు తీసుకోకపోతుండటంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి.

గుంటుపల్లి మృతి టీడీపీకి తీరనిలోటు : యరపతినేని

● చంద్రబాబు, లోకేశ్ ఫోన్‌లో పరామర్శ



టీడీపీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఇన్‌సెట్లో గుంటుపల్లి (ఫైల్)

దాచేపల్లి, మార్చి 19: గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి పట్టణానికి చెందిన టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు ఆకస్మిక మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం గుంటుపలి నర్సరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, ఆలపాటి రాజా, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జ్‌లు జూలకంటి బ్రహ్మారెడ్డి, చదలవాడ అరవింద్‌బాబు, ఇతర ప్రముఖులు, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, వివిధ హోదాల్లో వున్న నాయకులు గుంటుపల్లి కుటుంబసభ్యులను నేరుగా, ఫోన్ ద్వారా పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గుంటుపల్లి టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్త నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుసార్లు, నవ్యాంధ్రప్రదేశ్‌లో ఒకసారి రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. యరపతినేని శ్రీనివాసరావుకు ఆత్మీయుడిగా అయనతో కలిసి పనిచేశారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు పార్టీ పరంగా, తన వ్యక్తిగతంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడు వుంటాయని భరోసా ఇచ్చారు. గురజాల, మాచర్ల, నరసరావుపేట, పలు నియోజకవర్గాల నుంచి సామాన్య కార్యకర్తలు గుంటుపల్లి భౌతిక దేహానికి నివాళులు అర్పించారు. గురువారం ఉదయం అంత్యక్రియలు జరుగనున్నాయని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. యరపతినేనితో పాటు డాక్టర్ యరపతినేని రమేష్‌బాబు, యరపతినేని తనయుడు యరపతినేని నిఖిల్, తదితరులున్నారు.

గుంటుపల్లి సేవలు ఎనలేనివి: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, మార్చి 19: పల్నాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గుంటుపల్లి నాగేశ్వరరావు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. గుంటుపల్లి మృతిచెందారన్న వార్త తనని తీవ్రంగా కలచివేసిందని, సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన సేవలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు.

గుంటుపల్లి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి: జీవీ

నరసరావుపేట టౌన్, మార్చి 19: బీసీ సీనియర్ నాయకుడు గుంటుపల్లి నాగేశ్వరరావు మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్న సమయంలో ఇలా జరగడం తీవ్రంగా కలచివేసిందన్నారు. ఒక గొప్ప సహచరుడిని కోల్పోయామని అన్నారు. నాగేశ్వరరావు మృతి పట్ల సంతాపాని తెలియజేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎన్నికల కోడ్ అంటూ అధికారుల విధ్వంసం

● పసుపు రంగు ఉందంటూ సిమెంటు బెంచీలు ధ్వంసం


యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో అధికారులు ధ్వంసం చేసిన బెంచీలు

యడ్లపాడు, మార్చి 19: దాతలు ప్రజోపయోగం నిమిత్తం కూడళ్లలో ఏర్పాటుచేసిన సిమెంటు బెంచీలను ఎన్నికల కోడ్ పేరుతో అధికారులు ధ్వంసం చేశారు. కనీసం దాతలకుగాని, స్థానికులకు గాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ధ్వంసం చేయడం విమర్శలకు దారి తీసింది. కేవలం బెంచీలకు పసుపు రంగు వేసి ఉందన్న సాకుతో ఇలా ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. తమకు చెప్పినా పట్టలు చుట్టడమో లేదా రంగులు మార్చడమో చేసి ఉండేవారమని దాతలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం వేసిన బెంచీలను తహసీల్దార్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి ధ్వంసం చేశారని ఆరోపించారు.

వారం నుంచి.. వెక్కిళ్లే..

● కాకుమానులో నీటికి కటకట

● ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి

కాకుమాను, మార్చి 19: మండల కేంద్రమైన కాకుమానులో తాగు నీరు లేక ప్రజలు అల్లాడుతున్నారు. మేజర్ పంచాయతీ కాకుమానులో 10 వేలకు పైగా జనాభా ఉంటున్నారు. గత ఇరవై రోజుల నుంచి గ్రామంలో తాగు నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉంది. వీర్లంకమ్మ గుడి బజారు, ఎస్సీ కాలనీలో నీరు సరఫరా చేసి ఎనిమిది రోజులైంది. గ్రామంలో పడమర చెరువు నుంచి పంచాయతీ అధికారులు గ్రామంలో నీటిని సరఫరా చేసేవారు. ఏటా వేసవి ఎద్దడిని దృష్ట్యా మార్చి నెలలో చెరువులను నీటితో నింపేవారు. ఈ ఏడాది ఫిబ్రవరి రెండవ వారంలోనే కొమ్మమూరు కాలువకు నీటి సరఫరా నిలిచింది. కొమ్మూరు, అప్పాపురం, పెద్దివారిపాలెం వంటి గ్రామాల్లో వరద నీటిని చెరువులో నింపారు. కాకుమానులో అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ఆ ప్రయత్నం చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాకుమాను పడమర చెరువులో ఫిబ్రవరి 20వ తేదీ నాటికే నీరు పూర్తిగా అడుగంటింది. దానిని దృష్టిలో ఉంచుకుని పెద్దివారిపాలెం శివారులో ఉన్న అక్కుల చెరువులో నీటిని గ్రామంలో సరఫరా చేశారు. ఆ చెరువులో కూడా నీటి నిల్వలు తగ్గిపోయాయి. ఇటువంటి పరిస్థితిలో గ్రామంలో అధికారులు చేసేదేమి లేక మిన్నకుండిపోయారు. కాకుమానులో తాగునీటి సరఫరా కోసం అప్పాపురం మీదగా ప్రవహిస్తున్న కొమ్మమూరు కాలువ వద్ద పైలెట్ ప్రాజెక్టు ఆధారం. పైలెట్ ప్రాజెక్టుకు కరెంటు బకాయి ఉండడంతో ఆ ప్రాజెక్టు కూడా మూతపడింది. అక్కుల చెరువు నుంచి సుమారు ఐదు కిలోమీటర్‌ల దూరం నుంచి గ్రామానికి నీటి సరఫరా అవుతుంది. కొంత మంది రైతులు పంట ఉత్పత్తులు రక్షించుకునేందుకు పైప్‌లను ధ్వంసం చేయడంతో గ్రామానికి నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. కొంతమంది పీపాను రూ.600 నుంచి రూ.1000 వరకు కొనుగోలు చేసి అవసరాలకు వాడుకోవాల్సి వస్తుంది. పేదలు, కూలీలు అంత నగదు చెల్లించే పరిస్థితి లేక నానా తిప్పలు పడుతున్నారు. వయోభారంతో బాధ పడేవారు నగరాల్లో ఉన్న వారి బంధువులు ఇళ్లకు వెళుతున్నారు. వారం నుంచి గ్రామంలో నీటి సరఫనా లేకపోవడంతో మంగళవారం గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గేదెలకు నీరు లేక కిలోమీటర్ దూరంలో ఉన్న అప్పాపురం చానల్ వద్దకు నీటికి వదులుతున్నారు. తాము వాడుకోవడానికి నీరు లేక పశువులకు నీరు అందించలేక పశుపోషకుల బాధలు వర్ణనాతీతం.


ఆటోల్లో నుంచి నీటిని క్యాన్‌లోకి పట్టుకుంటున్న స్థానికులు


రిక్షాలపై క్యాన్‌లు, బిందెలతో నీటిని తీసుకు వెళ్తున్న చిన్నారులు


పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు వద్ద తమగోడు వెళ్లబోసుకుంటున్న బీసీ కాలనీ వాసులు


పచ్చగా రంగుమారి ఉన్న నీటిని తాగుతున్న పశువులు


కుంటల్లో ఉన్న నీటిని తోడుకుంటున్న కాకుమాను ఎస్సీ కాలనీ వాసులు

గిరిజనులపై వైసీపీ అరాచక పాలన

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్


గుంటూరు, మార్చి 19: గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న ఆదివాసీ గిరిజనులు వైసీపీ పాలనలో తీవ్ర అన్యాయానికి గురయ్యారని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలుగుదేశం ప్రభుత్వం పారిశ్రామిక రాయితీలు అందిస్తే జగన్ రెడ్డి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని ధ్వజమెత్తారు. ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను సైతం దారి మళ్లించిన గిరిజన ద్రోహి జగన్ రెడ్డి అని విమర్శించారు. నాడు చంద్రబాబు నాయుడు ఆదివాసీలు ఉద్యోగ-అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి చూసి ఐటీడీఏ ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా జీవీవీకె స్కూల్స్‌ను ఏర్పాటు చేసి గిరిజన నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించారన్నారు. జగన్ రెడ్డి వాటిని జీపీఎస్ స్కూల్స్‌గా మార్చి అనేక స్కూల్స్ మూసివేయించాడన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం హెల్త్ అసిస్టెంట్లను టీడీపీ ప్రభుత్వం నియమించిందన్న కక్షతో వారిని తొలగించి కొన్ని వేలమంది పిల్లల మరణాలకు కారణమయ్యిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దు చేయబడిన అన్ని పథకాలను రాబోయే తెలుగుదేశం ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామని చెప్పారు.

ప్రజాగళం భద్రత వైఫల్యంపై విచారణ చేపట్టాలి: కన్నా

సత్తెనపల్లి మార్చి 19: ప్రజాగళం సభ భద్రత వైఫల్యంపై విచారణ చేపట్టాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ వలన వేలాదిమంది సభకు రాలేక పోయారని అన్నారు. సభకు వచ్చిన లక్షలాదిమంది జన తోసుకువస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూశారని కన్నా అన్నారు. సభలో పోల్స్ ఎక్కిన వారిని దిగాలని స్థానిక పోలీసులు నియంత్రించాల్సి ఉండగా స్వయంగా ప్రధాన మంత్రి చెప్పారంటే పోలీసుల వైఖరి అర్ధమవుతుందని కన్నా అన్నారు. ఈ ప్రభుత్వంలో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని అన్నారు. ప్రదాని భద్రత, ట్రాఫిక్ నియంత్రణ అంశాలను పోలీసుబాసులు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమీషన్ సమగ్ర విచారణ జరపాలని అన్నారు.

ఎన్నికల దారికి శ్రీకారం

● అధికారుల ఫిర్యాదుతో ఆగిన పనులు

బెల్లంకొండ - వన్నాయపాలెం మధ్యలో వేసిన రహదారి


బెల్లంకొండ, మార్చి 19: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయినా కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. తాయిలాల పంపిణీలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో అధికార పార్టీ నేతలు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతూ ఓటర్లను వలలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. బెల్లంకొండ - వన్నాయపాలెం గ్రామాల మధ్య పంట పొలాలకు వెళ్లే రహదారిని ఏర్పాటు చేస్తాం.. మీరందరూ ఓటు వేయాలని అధికార పార్టీనేతలు రోడ్డు వేసేందుకు పనులు మొదలుపెట్టారు. ముఖ్య నేతకు చెందిన ఎక్స్‌కవేటర్ సాయంతో మంగళవారం పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు కొందరు ఆర్వో శ్రీరాములకు ఫిర్యాదు చేశారు. ఆయన పనులను ఆపించేశారు.

తాయిలాలు ఆశించకుండా ఓటు వేయాలి

లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ


కన్నెగంటి పాపారావు ఆత్మకథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ తదితరులు

బాపట్లరూరల్, మార్చి 19: తాయిలాలు ఆశించకుండా నేటి యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని లోక్ సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ తెలిపారు. కన్నెగంటి పాపారావు ఆత్మకథ విత్తనంలో విశ్వం పుస్తకావిష్కరణ సభ మంగళవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్‌నారాయణ మాట్లాడుతూ యువత బంగారు భవిష్యత్తు కోసం ఓటు అనే ఆయుధంతో మార్గం వేసుకోవచ్చని వివరించారు. తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ఓటు వేయాలని సూచించారు. పత్తిసాగులో విప్లవమార్పు తీసుకొచ్చిన వ్యక్తి కన్నెగంటి పాపారావు అన్నారు. వేలాదమంది జీవితాలలో వెలుగు నింపిన వ్యక్తిగా ఒక రైతుగా, సామాజికకార్యకర్తగా, మంచిపౌరుడిగా వెలుగొందిన వ్యక్తన్నారు. సమాజానికి ఏది అవసరమో దాని కోసం రైతులను ప్రభుత్వాలు ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచలో ఎక్కడా జరగనటువంటి అన్యాయం మనదేశంలోని రైతులకు జరుగుతున్నదన్నారు.

నరసరావుపేట మార్గంలో పలు రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): బుగ్గనపల్లి - బేతంచర్ల మధ్యన రెండో రైలు మార్గం పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నెంబరు.17253 గుంటూరు - సికింద్రాబాద్, నెంబరు.17254 సికింద్రాబాద్ - గుంటూరు, ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు నెంబరు.17228 గుంటూరు - డోన్, ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నెంబరు 17227 డోన్ - గుంటూరు రైళ్లను రద్దు చేశామన్నారు. నెంబరు.22831 హౌరా - శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27న, నెంబరు 22832 శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా, ఈ నెల 29న నెంబరు.22883 పూరీ - యశ్వంత్‌పూర్ రైళ్లను నంద్యాల, యర్రగుంట్ల మీదగా దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ మూడు రైళ్లను రద్దు చేస్తున్నట్లు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరిస్తున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

మాచవరం, మార్చి19: మండలంలోని తురకపాలెం గ్రామ సచివాలయం కార్యదర్శికి మంగళవారం ఎంపీడీవో బి.సురేష్ షోకాజ్ నోటీసు జారీచేశారు. ఆంధ్రజ్యోతి జిల్లా పత్రికలో కోడ్ ఉల్లంఘన.. సచివాలయంలో వైసీపీ నాయకుల సమావేశం అనే శీర్షిక న వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనికి స్పందించిన సచివాలయ కార్యదర్శి రామరాజుకి షోకాజ్ నోటీసు జారీచేశారు. ఈ నెల 17వ తేదీ రాత్రి గ్రామ సచివాలయంలో వైసీపీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ముస్లింల రిజర్వేషన్‌పై సమావేశం నిర్వహించి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో అధికారులు స్పందించి సదరు సచివాలయ కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీచేసి సదరు విషయంపై రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలంటూ ఆదేశించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

1,15,322 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,19,996 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,15,322 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 88,720 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు.5	10000	17000
273	10000	19000
341	9000	18000
4884	10500	16800
సూపర్ 10	11500	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20500
బ్యాడిగి	10000	19500
దేవనూరు డీలక్స్	10000	18000
తెల్లకాయలు	5000	12500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



నల్లమోతువారిపాలెం గ్రామానికి చెందిన 30 మంది వైసీపీ నాయకులకు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ

టీడీపీలో చేరిన నల్లమోతువారిపాలెం వైసీపీ నాయకులు

బాపట్ల, మార్చి 19 : కర్లపాలెం నల్లమోతువారిపాలెం గ్రామంలో వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించిన తాండ్ర రవిబాబు 30 కుటుంబాల వారితో కలిసి మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీలో తమకు సముచిత స్థానం లభించకపోవటంతో మనస్థాపానికి గురై తెలుగుదేశంతోనే మంచి భవిష్యత్తు ఉంటుందని భావించి పార్టీలో చేరుతున్నట్లు వారు అన్నారు. నరేంద్రవర్మ విజయానికి అంకితభావంతో కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. టీడీపీలో చేరిన వారిలో తాండ్ర రవిబాబు, బాపట్ల ప్రసాద్, బి.నాంచారయ్య, బి.నవీన్, బాపట్ల వెంకటలక్ష్మి, బాపట్ల శిరీషా, బాపట్ల లక్ష్మీకుమారి, ఇందేటి సాయిబాబు, అనూష, జి.సాల్మన్‌రాజు, నంబూరి వెంకటేష్, షేక్ హనీఫ్, పొట్లూరి శ్రీనాథ్, చెవూరి వంశీ, శ్యామల, వలికార్తీక్, టి.వెంకటేష్, టి.సుభాషిణి, వాలి పుష్పబాయి, పొన్నం నారాయణ, దాసరి హేమలత, చిలకలపూడి వంశీకృష్ణ, బాపట్ల బాబు, అంజమ్మ తదితరులు ఉన్నారు. అదేవిధంగా నల్లమోతువారిపాలేనికి చెందిన నన్నమూడి సాయితేజ, అలుమోలు శివనాగిరెడ్డి, పి.వంశీకుమార్, ఓ.శ్రీనివాస్‌యాదవ్‌లు కూడా తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి నరేంద్రవర్మ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ముస్లిం యువత...

కర్లపాలెం పాతూరు ఇస్లాంపేటకు చెందిన ముస్లిం యువత మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు వై.భూపతిరావు, కర్లపాలెం ఉపసర్పంచ్ పఠాన్ ఆధ్వర్యంలో నూతనంగా ఓటు హక్కు పొందిన ముస్లిం యువతకు నరేంద్రవర్మ కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ విజయానికి కృషి చేస్తామని వారు అన్నారు. కార్యక్రమంలో పఠాన్ కరీముల్లా, పఠాన్ అహ్మద్‌బాషా తదితరులు ఉన్నారు.

● కర్లపాలెం గ్రామపంచాయతీ కొత్తూరుకు చెందిన ముగ్గురు వైసీపీ యువ నాయకులు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ రఫీ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి నరేంద్రవర్మ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేంద్రవర్మ విజయానికి తాము కృషి చేస్తామని షేక్ షీలార్, పఠాన్ షౌకత్ ఆలిఖాన్, షేక్ రహంతుల్లా అన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

బాపట్ల, మార్చి 19 : వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మకు వినతి పత్రం అందజేశారు. వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్‌లు, ఫార్మసిస్టులు, హెల్త్ అసిస్టెంట్‌లకు సంబంధించిన శాఖా పరమైన సమస్యలు సత్వరమే పరిష్కరించేవిధంగా చూడాలని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సత్యంరాజు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బడుగు శివాజీ, ఎ.శ్రీనివాసరావు, శ్యామల తదితరులు ఉన్నారు.



డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ విజయమ్మకు వినతిపత్రం అందజేస్తున్న వైద్యసిబ్బంది

హిందీ పరీక్షకు జిల్లాలో 484 మంది గైర్హాజరు

బాపట్ల టౌన్, మార్చి 19 : పదవ తరగతి హిందీ పరీక్షకు రెండో రోజు మంగళవారం జిల్లాలో 108 పరీక్షా కేంద్రాలలో 17,090 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. అందులో 16,606 మంది విద్యార్థులు హాజరుకాగా మరో 484 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా జిల్లాలో 97.17 శాతం హాజరు నమోదైంది. జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు వెదుళ్ళపల్లి, చినగంజాం 5 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలలో విద్యార్థులను తనిఖీ చేశారు. బాపట్లలో పరీక్షా సమయానికి ట్రాఫిక్ సమస్య కారణంగా కొన్ని ఇబ్బందులను విద్యార్థులు ఎదుర్కొన్నారు.

వసతులు లేక విద్యార్థులు ఇక్కట్లు

పలుపరీక్షా కేంద్రాలలో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వసతులు కల్పించటంలో విద్యాశాఖాధికారులు వైఫల్యం చెందారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు సరిపడ తాగునీరు వసతి ఏర్పాటు చేయకపోవటం, మరికొన్ని కేంద్రాలలో తాగునీరు ఉన్నప్పటికి గ్లాసులు లేకపోవటం, పలుకేంద్రాలలో ఫ్యాన్లు ఉన్నప్పటికీ గాలిరాకపోవటంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం

బాపట్లటౌన్, మార్చి 19 : పౌష్టికాహారంతో విద్యార్థులంతా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని బాపట్ల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి అన్నారు. ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం మరుప్రోలువారిపాలెం మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ దైనందిక జీవితంలో స్వచ్ఛమైన జీవనవిధానం, మంచి ఆహారపు అలవాట్లు ప్రతివిద్యార్థికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాలల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.పూర్ణచంద్రరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం

బాపట్లటౌన్, మార్చి 19 : విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని ఛేంజ్ మేకర్ డైరెక్టర్ కె.రామకృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి సంయుక్తంగా తెలిపారు. ఫార్మసీ కళాశాలలో నెలరోజులు ఫైనలీయర్ విద్యార్థులు యు నెక్స్ అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు మాతృభాషతోపాటు అంగ్లభాషపై పట్టు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు డి.రామ్మోహనరావు, గెల్లి దిలీప్, జాయింట్ సెక్రటరి అండ్ కరస్పాండెంట్ కొమ్మినేని హరిపద్మప్రసాద్, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించి గోరుముద్దను అందజేయాలి : ఎంఈవో

పిట్టలవానిపాలెం, మార్చి 19 : ఎండవేడిని దృష్టిలో ఉంచుకొని ఎండిఎం నిర్వాహకులు సమయపాలన పాటించి పాఠశాలలోని విద్యార్థులకు గోరుముద్దను అందజేయాలని పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి గోరుముద్దను పరిశీలించారు. ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు ఎండకాలం దృష్టిలో ఉంచుకొని మధ్యాహ్నం 12.30లోపు విద్యార్థులకు భోజనం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం నిర్వాహకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగి అక్రమాలపై జేసీకి ఫిర్యాదు

బాపట్ల, మార్చి 19 : నియోజకవర్గంలోని పిట్టలవానిపాలెం మండలం అల్లూరు రెడ్లపాలెం శివారు జగనన్నకాలనీలో అనేక అవకతవకలు జరిగాయంటూ గ్రామానికి చెందిన వారు మంగళవారం జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి లబ్ధిదారుల ఎంపికలో కీలకంగా వ్యవహరించి ముడుపులు తీసుకొని అనర్హులకు నివేశన స్థలాలు మంజూరు చేయించారని వారు ఆరోపించారు. అర్హత ఉన్న వారు డబ్బులు ఇవ్వలేదనే కారణంతో వారికి స్థలాలు కేటాయించలేదన్నారు. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. 2019కు ముందు మృతి చెందిన వారికి, పెళ్ళికాని వారికి, ఇల్లు ఉన్న వారికి, గ్రామంలో లేని వారికి, ఆర్మీ ఉద్యోగులకు, ఇళ్ళస్థలాలు ఉన్నవారికి కూడా స్థలాలిచ్చారని వారు ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రేపల్లె, మార్చి 19 : పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తూ వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు పిట్టు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలేనికి చెందిన వైసీపీకి చెందిన 30 కుటుంబాలకు ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికే ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. రానున్న ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. చిలకలూరిపేటలో లక్షలాది మంది జనసమూహం మధ్య జరిగిన ప్రజాగళం సభను చూసి ఓర్వలేక వైసీపీకి చెందిన కొందరు నాయకులు లబోదిబోమంటూ జనం ఎక్కువ రాలేదంటూ చెప్పటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, అలిమోలు చిరంజీవిరెడ్డి, అక్కల రామసుబ్బారెడ్డి, పిట్టు సాంబిరెడ్డి, యేనుగుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

నిజాంపట్నంలో.....

నిజాంపట్నానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మిడి రామకృష్ణ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన లంకే వీరరాఘవయ్య, నాయుడు భాస్కరరావు, పీతా రమేష్, మోకా శ్రీనివాసరావు, చెన్ను అంతిరాజులను ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పార్టీలోకి ఆహ్వానించారు. అందరికి అండగా ఉంటానని, ఎలాంటి అధైర్యపడాల్సిన పని లేదని ఎమ్మెల్యే అనగాని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పంతాని మురళీధరరావు పాల్గొన్నారు.

రహదారులు శుభ్రం చేసిన ఎన్ఎస్ఎస్ క్యాంప్ విద్యార్థులు

పిట్టలవానిపాలెం, మార్చి 19 : మండలంలోని ఖాజీపాలెం సర్పంచ్ కె.అనూష ప్రసన్న ఆధ్వర్యంలో ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కళాశాల విద్యార్థినీని, విద్యార్థులు రహదార్ల పక్కనే శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతిపరిధిలోని అన్ని రహదారులలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ క్యాంప్ అధికారి ఏడుకొండలు, ఖాజీపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో నాగరాజు, ఖాజీపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడు కూచంపూడి దేవేంద్రరాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ గుమ్మడి సీతయ్య, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు సేవ చేసేందుకే ట్రస్ట్ ఏర్పాటు

● ఈఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎస్తేరురాణి

బాపట్ల, మార్చి 19 : పేద కుటుంబాల వారికి సేవ చేసేందుకే ట్రస్ట్ స్థాపించినట్లు ఈఆర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎస్తేరురాణి తెలిపారు. బాపట్ల మండలం హైదర్‌పేట గ్రామంలో ఏర్పాటు చేసిన బాపట్ల జిల్లా ట్రస్ట్ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ చిలకలూరిపేటలో ప్రారంభించిన ఈ ట్రస్ట్ విడతల వారిగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, స్టేట్ కోఆర్డినేటర్ ఎంవి.సూరిబాబు, జీవి సుబ్బారెడ్డి, ప్రకాశం జిల్లా కోఆర్డినేటర్ చంద్రమౌళి, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ ఇమానీయేలు, పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ ఏసమ్మ, బాపట్ల జిల్లా కోఆర్డినేటర్ ఇవాంజలిన్, పాస్టర్ భూషణం, పాస్టర్ ఏసురత్నం, రూతుమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల తాయిలాలు అందించేవారిపై ఫిర్యాదు చేయాలి

● సేల్‌ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి

బాపట్ల, మార్చి 19 : బాపట్ల సర్కిల్ పరిధిలో రాజకీయ పార్టీల నాయకులు ఏరకమైన వస్తువులు ఉచితంగా లేదా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పంపిణీ చేస్తే వారిపై ఫిర్యాదు చేయాలని బాపట్ల సేల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఈవిధంగా ఎవరైన చేస్తే 9154970445 అనే వాట్సప్ నెంబర్‌లో మెసేజ్ పెట్టాలని ఆయన కోరారు.

నేటి నుంచి వేగేశన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

బాపట్ల, మార్చి 19 : పట్టణంలోని పాండురంగాపురం రోడ్డులో వెంకయ్యస్వామి గుడి పక్కన గ్రౌండ్‌లో ఈనెల 20 నుంచి వేగేశన క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వేగేశన నరేంద్రవర్మ అన్నారు. దీనికిసంబంధించిన పోస్టర్‌లను ఆర్గనైజర్స్‌తో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని క్రీడాకారులు పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోటీలలో మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వే లు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌కు రూ.5 వేలు, బెస్ట్ వికెట్ కీపర్‌కు రూ.5 వేలు, బెస్ట్ ఫీల్డ్‌కు రూ.5 వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.5 వేల చొప్పున ఇవ్వటం జరుగుతుందన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీలో పాల్గొనాలని ఆయన కోరారు.



యువతతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న నరేంద్రవర్మ

వీఆర్వో రమేష్‌రెడ్డికి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి

కర్లపాలెం, మార్చి 19 : కర్లపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న రమేష్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో రమేష్‌రెడ్డిని మంగళవారం తహసీల్దార్ నిర్మలానందబాబా, సిబ్బంది దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సలీమా, ఆర్ఐ కర్రి శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, లారీల సీజ్

పిట్టలవానిపాలెం, మార్చి 19 : నగరం మండలం నుంచి పిట్టలవానిపాలెం మండలం వైపు అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్‌లు, ఒక లారీని బాపట్ల సెబ్ సీఐ తమ సిబ్బందితో కలిసి చాకచాక్యంగా పట్టుకొని చందోలు పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై మంగళవారం చందోలు ఎస్సై అనీల్‌కుమార్ కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.

మూలపాలెం జగనన్నకాలనీలో ఓ ఇంట్లో చోరీ

బాపట్లరూరల్, మార్చి 19 : మూలపాలెం జగనన్నకాలనీలోని ఓ ఇంట్లో చోరీ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం జగనన్నకాలనీలోని మంచాలశివ అనే మహిళ ఇంట్లో దొంగలు మూడుసవర్ల బంగారం, 12వేల రూపాయల నగదును దొంగలించారని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

రెండు గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లు కవాతు



పెసర్లంకలో కవాతు నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు, పోలీసులు

కొల్లూరు, మార్చి 19 : రెండు గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని పెసర్లంక, రావికంపాడు గ్రామంలో ఎస్ఐ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో కవాతు సాగింది. ఎస్ఐ మాట్లాడుతూ, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించేందుకు ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందన్నారు. అందులో భాగంగా సమస్యాత్మక గ్రామాల్లో కవాతులు నిర్వహించినట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ సూచించారు.

ఆక్రమణకు గురైన సొసైటీ స్థలం సర్వే

భట్టిప్రోలు, మార్చి 19 : దాతలు సొసైటీకి అప్పగించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారంటూ స్థానికులు కోర్టును ఆశ్రయించారు. లోక్ అదాలత్ కోర్టు ఆదేశాల మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి పివి సుబ్బారావు మంగళవారం అద్దేపల్లిలో గల సొసైటీ స్థలాన్ని పరిశీలించి సహకారశాఖ అధికారుల సమక్షంలో కొలతలు నిర్వహించారు. రెవెన్యూ రికార్డులలో 1962 సంవత్సరం నుండి సర్వే నెంబరు 465-1 స్థలం సొసైటీ స్థలంగా నమోదై ఉన్నదని, సదరు స్థలానికి పంచాయతీ పన్నులు కూడా సొసైటీ చెల్లిస్తుందని, స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహకార జిల్లా అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రారు మోహనరెడ్డి, మండల సర్వేయర్ బొర్రా శ్రీనివాసరావు, సీఈఓ వేములపల్లి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, వీఆర్ఓలు సిబ్బంది పాల్గొన్నారు.



సొసైటీ స్థలాన్ని సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వేసవి దృష్ట్యా ఉపాధి పని వేళల్లో మార్పులు : ఎంపీడీవో

వేమూరు, మార్చి 19 : వేసవి కాలం దృష్ట్యా ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీల పని సమయంలో మార్పులు చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మంగళవారం ఆయన వేమూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్ తనిఖీ చేశారు. కూలీలకు తాగునీటి సౌకర్యంతో పాటు ప్రథమ చికిత్సకు సంబంధించిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని, పని జరిగే ప్రాంతంలో నీడ కోసంగా టెంట్ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఎండలోనే ఆరోగ్య సురక్షా వైద్య సేవలు

● ఇబ్బందికి గురైన రోగులు



కొల్లూరు సచివాలయంలో ఎండలోనే వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

కొల్లూరు, మార్చి 19 : ఆరోగ్య సురక్షా వైద్య సేవలు అమలులో నిధుల లేమి స్పష్టంగా కనిపిస్తుంది. కొల్లూరు సచివాలయంలో మంగళవారం ఆరోగ్య సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసేవలు పొందేందుకు వచ్చిన రోగులు వైద్యసేవల కోసం ఎండలోనే పడిగాపులు పడాల్సి వచ్చింది. గతంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముందస్తుగా సచివాలయాలు రూ.20 వేలు నిధులు అందించడంతో ఆయా సచివాలయ కార్యదర్శి కార్యక్రమం కోసం టెంట్‌లు, కుర్చీలు తదితర వాటిని సమకూర్చేవారు. ప్రస్తుతం అమలు అవుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం-2లో ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులు అందకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు మమ అనిపిస్తున్నారు. వైద్యసేవల్లో పాలు పంచుకున్న వైద్యులు, సిబ్బంది సైతం తమ భోజన ఏర్పాట్లు తామే చేసుకోవడం గమనార్హం.

కొనసాగుతున్న పది పరీక్షలు

భట్టిప్రోలు, మార్చి 19 : పదవ తరగతి పరీక్షలు మండలంలో కొనసాగుతున్నాయి. మండలంలోని 5 పాఠశాలల్లో మంగళవారం జరిగిన పరీక్షకు 778 మంది విద్యార్థులకు గాను 74 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓలు పి.లాజరు, ఎస్.దేవరాజ్ తెలిపారు. మండలంలోని పెదపులివర్రు జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం జరిగిన పరీక్షలో 20 నిమిషాలు ఆలస్యంగా ప్రశ్నాపత్రం ఇచ్చారని, నిర్ణీత సమయానికే పేపర్లు తీసుకున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ దేవరాజ్‌ను వివరణ కోరగా మండలంలో ప్రశాంతంగానే పరీక్షలు జరుగుతున్నాయని సదరు విషయంపై విచారణ జరుపుతామన్నారు.

కర్లపాలెం మండలంలో 16 మంది గైర్హాజరు

కర్లపాలెం, మార్చి 19 : కర్లపాలెం మండలంలో జరుగుతున్న 10వ తరగతి పరీక్షలలో రెండో రోజు హిందీ పరీక్షకు 16 మంది గైర్హాజరైనట్టు మండలవిద్యాశాఖాధికారి విజయశ్రీ మంగళవారం తెలిపారు. యాజలి పరీక్షా కేంద్రంలో ఒకరు, ఎం.విరాజుపాలెం పరీక్షా కేంద్రంలో 7గురు, చింతాయపాలెం పరీక్షా కేంద్రంలో 8మంది గైర్హజరయ్యారని ఎంఇవో వివరించారు.

వేమూరు మండలంలో 24 మంది...

వేమూరు, మార్చి 19 : మండలంలోని రెండు పరీక్షా కేంద్రాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షల్లో మంగళవారం హిందీ పరీక్షకు 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వేమూరు పరీక్ష కేంద్రంలో 212 మంది హాజరు కావలసి ఉండగా 192 మంది హాజరయ్యారు. 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పెరవలి పరీక్ష కేంద్రంలో 91 మందికి 87 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సూర్యలంక తీరంలో పది సెల్‌ఫోన్లు చోరీ

బాపట్లరూరల్, మార్చి 19 : బాపట్ల మండలం సూర్యలంక తీరం ఒడ్డున 10 సెల్‌ఫోన్లు చోరీకి గురైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. కొంతమంది పర్యాటకులు సూర్యలంకతీరంలో స్నానం చేసేందుకు వెళుతుండగా తమ సెల్‌ఫోన్‌లను కవర్లులో పెట్టి ఒడ్డున పెట్టి వెళ్ళటంతో దొంగలు తమ చాకచాక్యాన్ని చూపించారు. తీరా పర్యాటకులు ఒడ్డుకు చేరి చూస్తే తమ సెల్‌ఫోన్‌లు చోరీకి గురయ్యాయని గ్రహించారు. వెంటనే అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేయటం జరిగిందని రూరల్ పోలీసులు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో ఆనందబాబు తనయుడు అఖిలేష్

వేమూరు, మార్చి 19 : వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు తనయుడు డాక్టర్ అఖిలేష్ మంగళవారం మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్ళి గతంలో తన తండ్రి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండి ప్రజలకు అందించిన సేవలు సంక్షేమ పథకాలు అమలు అభివృద్ధి కార్యక్రమాలను అందరికీ గుర్తు చేశారు. జగన్ పాలనలో రాష్ట్రం దెబ్బతిన్నదని తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు అభివృద్ధి చెందుతుందని మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు దొప్పలపూడి సుధాకర్, నాయకులు శివరామకృష్ణ, బెల్లకొండ వెంకటేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, నల్లూరి బుజ్జిబాబు, కోగంటి విశ్వం, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బలిజేపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డాక్టర్ అఖిలేష్

ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబు తరపున ప్రచారం

కొల్లూరు, మార్చి 19 : వేమూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు తరుపున టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని జువ్వలపాలెం, శివరామపురం గ్రామాలలో మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్‌లు ఇంటింటికి తిరుగుతూ ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబుకు ఓటు వేయాలని కోరుతూ బాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, యలవర్తి కోటేశ్వరరావు, సుంకర రాంబాబు, శౌంతి సత్యనారాయణ, వేములపల్లి మోహనకృష్ణ, సుంకర శ్రీను, కుడితిపూడి బసవయ్య, జిఎల్‌జి భగవాన్, కోగంటి శివవెంకటేశ్వరరావు, దూళిపూడి కృష్ణ, గుమ్మడి సాంబశివరావు, రావుల రమేష్, తుమ్మల బాపయ్య చౌదరి, దొడ్డపనేని వెంకటేశ్వరరావు, గొరికపూడి ప్రసాద్, కాసరనేని మోహన్, మున్నంగి విజయ్, బుర్రి జగన్, శిగిలిశెట్టి రాఘవరావు, తోట సాంబయ్య, నర్రా మధు, కొమ్ము తులామాను, తలశిల పండబ్బాయి, కంచర్ల కోటయ్య, కంచర్ల వెంకటేష్, జన్ను శ్రీనివాసరావు, భూపతి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శివరామపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

భట్టిప్రోలు మండలంలో...

భట్టిప్రోలు, మార్చి 19 : టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ తరపున వేమూరు నియోజకర్గం నుంచి పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు గెలుపు కోసం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని పెదపులివర్రులో మంగళవారం ఇంటింటికి తిరుగుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నారు. ఆనందబాబుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఊసా రాజేష్, అనూరాధ, శ్రీనివాసరావు, టీడీపీ మండల కన్వీనర్ వాకా శేషుబాబు, నాయకులు జంపని వీరయ్య, నూతక్కి దినకర్‌బాబు, పుణ్యశ్రీనివాసరావు, మురళి, ఎన్ఆర్ఐ విభాగ నాయకులు పమిడిముక్కల మణికంఠ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

● 23న స్వామి కల్యాణం, 24న దివ్య రథోత్సవం




మూలవిరాట్‌లు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి

భట్టిప్రోలు, మార్చి 19 : భట్టిప్రోలు తిరునాళ్ళగా పేరుగాంచిన భ్రమరాంబ మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 20 నుంచి 26 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా 23న రాత్రి ఎదురుకోల ఉత్సవం, అనంతరం స్వామి కల్యాణ మహోత్సవం, 24న ఆదివారం కల్యాణమూర్తులైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం అనంతరం సాయంత్రం దివ్య రథోత్సవం, 25న వసంతోత్సవం, సహస్రదీపోత్సవం జరుగుతాయని దేవస్థాన ట్రస్టీలు తెలిపారు. ప్రతి ఏటా జరిగే దివ్య రథోత్సవంలో అద్దేపల్లి - భట్టిప్రోలు గ్రామాలకు చెందిన భక్తులే కాకుండా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, ఉభయ గోదావరి జిల్లాలతో పాటుగా తెలంగాణ రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి రథానికి కట్టిన మోకులను లాగుతూ తమ భక్తిని చాటుకుంటారు. ఉత్సవాలు, రథోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, పద్మశాలీయ సంఘీయులు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. రథోత్సవం మరుసటి రోజు సోమవారం రాత్రి దేవాలయం వద్ద పద్మశాలీయ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించనున్నారు.

కార్యాలయాలపై పార్టీ రంగులు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బలిజేపల్లిలో రైతు భరోసా కేంద్రం వైసీపీ రంగులు తొలగిస్తున్న కార్మికుడు

వేమూరు, మార్చి 19 : యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు అంటూ ఆంధ్రజ్యోతిలో మంగళవారం వెలువడిన కథనానికి రేపల్లె సబ్ కలెక్టర్ స్పందించారు. మండల పరిధి గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలపై ఉన్న వైసీపీ రంగులను తక్షణమే తొలగించాలని ఎంపీడీవో శేషగిరిరావును ఆదేశించారు. దీంతో ఎంపీడీవో 17 గ్రామ పంచాయతీల పరిధిలోని కార్యదర్శులను తక్షణ చర్యలకు ఆదేశించారు. కార్మికులతో కలసి కార్యదర్శులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వేసి ఉన్న పార్టీ రంగులను తొలగింప చేశారు. అలాగే రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన తరువాత వాటి దిమ్మలపై ఉన్న శిలాఫలకాలను కూడా మూయించి వేశారు. మరికొందరి ఇళ్లపై ఉన్న ముఖ్యమంత్రి జగన్‌తో కూడిన వైసీపీ ప్రచార బోర్డులను కూడా తొలగింపజేశారు. గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, కార్యదర్శులు కార్మికులు వీధులలో తిరిగి ఇంకెక్కడైనా పార్టీలకు సంబంధించిన బోర్డులు జెండాలు ఉంటే బుధవారం సాయంత్రం లోగా పూర్తిగా తొలగింపు చేయాలంటూ ఆదేశించారు.

నేత్రదానం మరొకరికి కంటికి వెలుగులు

నగరం, మార్చి 19 : నేత్రదానం చేయటం ద్వారా మరొకరికి కంటి వెలుగులు అందించేందుకు దోహదపడుతుందని ఎస్వీఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల, హెల్ప్ ఫౌండేషన్ సత్తెనపల్లి, నెహ్రూ యువకేంద్రం గుంటూరు, నేత్రాలయ హైకేర్, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ టీవీలను ఎక్కువగా చూడటం వల్ల కంటి సమస్యలు అధికంగా వస్తున్నాయన్నారు. క్యారెట్, ఆకుకూరలు వంటి పోషక ఆహార పదార్థాలు తీసుకోవటం ద్వారా కంటి చూపును మెరుగుపరచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు షేక్ సైదా, హెల్ప్ ఫౌండేషన్ అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనరేజ్ నిధుల జమలో అధికారుల తప్పిదం

- నాలుగు గ్రామాల మధ్య వివాదం
- ఒక్క పంచాయతీకే కేటాయించిన వైనం
- ముగ్గురు సర్పంచ్‌ల ఫిర్యాదుతో డ్రా నిలిపివేత
- హైకోర్టును ఆశ్రయించిన కొణిదెన సర్పంచ్
- మిగతావారూ అదేబాటలో
- డబ్బులు విడుదల కాక అభివృద్ధి శూన్యం
- వెంటనే సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు వినతి





మల్లాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం.. నిధుల లేమితో నిరుపయోగంగా నక్కబొక్కలపాడు చెత్త సంపద కేంద్రం

బల్లికురవ. మార్చి 19 : పంచాయతీలకు కేటాయించే సీనరేజ్ నిధుల జమల్లో అధికారులు చేసిన తప్పుతో ఇప్పుడు నాలుగు గ్రామ పంచాయతీల మధ్య రోజురోజుకూ వివాదం పెద్దదవుతోంది. ఇప్పటికే నాలుగు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఎవరికి వారు పట్టుదలతో సీనరేజ్ నిధులు కావాలంటూ పట్టుబడుతున్నారు. దీంతో నాలుగు గ్రామాలలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు యథా ప్రకారం గతంలో మాదిరిగా నిధులు కేటాయించి ఉంటే సమస్య ఇంత పెద్దదయ్యేది కాదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూలో సర్వే నెంబరు 103లో కొణిదెన, మల్లాయపాలెం, కె.రాజుపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాలకు సంబంధించిన భూములు ఉన్నాయి. ఈ భూముల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో నాలుగు పంచాయతీలకు వాటాల మేర సీనరేజ్ నిధులు అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంది. గత పదిహేనేళ్ల నుంచి ప్రతి ఏటా మూడు క్వార్టర్లగా సీనరేజ్ నిధులను అధికారులు కేటాయిస్తున్నారు. 2008లో అప్పటి సర్పంచ్‌లు, అధికారులు కొణిదెన రెవెన్యూ ద్వారా వచ్చే ఆదాయాన్ని మల్లాయపాలెంకు 32 శాతం, కొణిదెనకు 24శాతం, కె.రాజుపాలెంకు 15 శాతం, నక్కబొక్కలపాడుకు 24 శాతం చొప్పున నిధులు కేటాయించేలా ఒప్పందం చేసుకొని రాత పూర్వక సంతకాలు కూడా చేసి ఉన్నారు. కాని గత నాలుగు మాసాల క్రితం జిల్లా పంచాయతీ అధికారులు మూడు క్వార్టర్ల సీనరేజ్ నిధులు సుమారు. రూ.1.40కోట్లను కొణిదెన పంచాయతీ ఖాతాకు జమ చేశారు. ఈ విషయం తెలిసిన మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు తమకు రావాల్సిన సీనరేజ్ నిధులు ఎందుకు వేయలేదని వెంటనే కలెక్టర్‌కు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఒప్పంద పత్రాలను కూడా వారికి చుపించారు. తప్పు జరిగింది అని తెలుసుకొన్న అధికారులు వెంటనే కొణిదెన పంచాయతీకి కేటాయించిన నిధులు డ్రా చేయకుండా ఖాతాను స్తంభించారు. వెంటనే జమ చేసిన నిధులు వెనక్కి పంపాలని పంచాయతీ కార్యదర్శికి జిల్లా అధికారులు లేఖ పంపారు. కొణిదెన సర్పంచ్ తస్నీరు లేపాక్షి మాత్రం సీనరేజ్ నిధులు మెత్తం మా గ్రామానికే చెందుతాయని తాను నిధులు వెనక్కి పంపేది లేదని వెంటనే హైకోర్టులో పిల్ వేశారు. సీనరేజ్ నిధులపై తమకు హక్కు ఉందని మిగిలిన గ్రామాలతో సంబంధం లేదని వెంటనే పంచాయతీ ఖాతాలో యథావిధిగా నిధులు డ్రా చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న మల్లాయపాలెం, రాజుపాలెం, నక్కబొక్కలపాడు సర్పంచ్‌లు జూపల్లి రాఘవరావు, అమరనేని లక్ష్మీ, దూళిపాళ్ల బుల్లిరామయ్య వారి వద్ద గతంలో వాటాల మేరకు అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పంద పత్రాలతో వారు కూడా హైకోర్టును ఆశ్రయించారు. వెంటనే మా గ్రామాలకు రావాల్సిన సీనరేజ్ నిధులు విడుదల చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టుకు విన్నవించారు. దీంతో నాలుగు గ్రామాలలో గత నాలుగు మాసాల నుంచి అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లా స్థాయిలో అధికారులు చేసిన తప్పుతో నాలుగు గ్రామాల మధ్య వివాదం పెద్దది అయి గ్రామాలలో పారిశుధ్యం కూడా పడకేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 15 ఏళ్ల నుంచి వాటాల మేర వేస్తున్న సీనరేజ్ నిధులు ఒక్క గ్రామానికే అధికారులు ఎలా కేటాయించారని వారు ప్రశ్నిస్తున్నారు. సీనరేజ్ నిధుల వ్యవహారం ప్రజలకు తెలిసి ఇప్పుడు గట్టిగా అడిగి వాటా ప్రకారం జమ చేయించుకోకుంటే మునుముందు తమ గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధుల లేమి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు వెంటనే ఈ వ్యవహారంలో కలుగ జేసుకొని నాలుగు గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి గతంలో వలే సీనరేజ్ నిధులు కేటాయింపు జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాటా మేరకు నిధులివ్వాలి



తమ గ్రామానికి రావాల్సిన సీనరేజి నిధులను వెంటనే అధికారులు కేటాయించాలి. 2008లో అధికారుల సమక్షంలో కొణిదెన రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల ప్రకారం వాటాలను కేటాయించారు. ఇప్పుడు నిధులు ఒక్క గ్రామానికే కేటాయించారు. అధికారులు చేసిన తప్పుకు గ్రామాలలో ఆందోళన నెలకుంది. ప్రజలకు ఈ విషయం తెలిసి తమపై ఒత్తిడి పెంచారు. వెంటనే అధికారులు తప్పును సరిదిద్దాలి. మా గ్రామానికి అన్ని గ్రామాల కన్న అత్యధికంగా 32 శాతం సీనరేజ్ నిధులు రావాల్సి ఉంది. - జూపల్లి రాఘవరావు, సర్పంచ్, మల్లాయపాలెం

సీనరేజ్ నిధులపై హైకోర్టును అశ్రయించాం



గత పదిహేనేళ్ల నుంచి వాటాల మేరకు సీనరేజి నిధుల కేటాయింపు జరుగుతుండేది. ప్రస్తుతం ఒక్క కొణిదెన గ్రామానికి మాత్రమే జిల్లా అధికారులు కేటాయించారు. ఈ విషయం తెలిసి అధికారులకు ఫిర్యాదు చేశాం. కొణిదెన సర్పంచ్ కోర్టుకు వెళ్లడంతో తాము కూడా తమ వద్ద ఉన్న ఆధారాలతో కోర్టును అశ్రయించాం. పంచాయతీలో నిధులు లేక గ్రామాలలో అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. అధికారుల తప్పిదంతో నాలుగు గ్రామాల మధ్య చిచ్చు రేపింది. - దూళిపాళ్ల బుల్లిరామయ్య, సర్పంచ్, నక్కబొక్కలపాడు



మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

ఎన్నికల నియమావళిని పాటించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

చీరాల, మార్చి 19 : రిజిస్టర్, రికగ్నైజేషన్ పొందిన అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ నాసరయ్యతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ప్రచార హోర్డింగ్‌లు లేదా ఫ్లెక్సీలు తదితరాలు ప్రైవేటు వ్యక్తుల స్థలాలు లేదా భవనాలపై ఉంచేప్పుడు, వారి గోడలపై ఏదన్నా రాతలు రాసినా ముందస్తుగా వారి అనుమతి పొందిన తరువాత మాత్రమే ఆ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎంపీ అభ్యర్థి అయితే రూ.90లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి అయితే రూ.40 లక్షలు వ్యయం చేయవచ్చాన్నారు. ఆయా పార్టీలకు సంబంధించి ప్రచారంలో పార్టీ జెండాలతో పాల్గొనే వాహనాలకు ముందస్తుగా వెహికల్ పర్మిషన్ తీసుకోవాలన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు లాంటి బహిరంగ ప్రదేశాల్లో కూడా ప్రచార హోర్డింగ్‌లు లాంటివి ఏర్పాటు చేయకూడదన్నారు. అలా ఎవరన్నా చేస్తే నోటీసులు ఇచ్చి 48 గంటల్లో తొలగిస్తామన్నారు. అభర్యుల నామినేషన్లు, విత్‌డ్రాయల్, స్క్రూటీని తరువాత బ్యాలెట్ పేపరులో ఆయా అభ్యర్థుల పేర్లు సక్రమంగా నమోదయ్యే విధంగా సరిచూసుకోవాలన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేవంలో ప్రసాద్(టీడీపీ), శివరామ ప్రసాద్(జనసేన), భరణీరావు(బీజేపీ), ఎన్.బాబూరావు(సీపీఎం), ఏ. బాబూరావు(సీపీఐ) భగత్‌సింగ్(బీఎస్పీ) పాల్గొన్నారు.

అధికారులకు కనిపించలేదా..?

కోడ్ వచ్చినా తొలగించని సీఎం బొమ్మ



మార్టూరు, మార్చి 19 : ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాల మీద ఉన్న ప్రజా ప్రతినిధుల బొమ్మలను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. మార్టూరులో చెరువు స్థలంలో నూతనంగా నిర్మించి న గ్రామ సచివాలయ భవనంపైన సీఎం బొమ్మను అధికారులు అలాగే ఉంచారు. కోడ్ వచ్చినా బొమ్మలు కనిపించలేదా అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల నిబంధనలను అధికారులు పాటించాలని కోరుతున్నారు.

ఫ్లెక్సీల తొలగింపులో పక్షపాతం

అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



నాగులచెరువుకట్ట వద్ద వైసీపీ రంగులతో ఆర్బీకే

ఇంకొల్లు, మార్చి 19 : కోడ్ వచ్చి మూడురోజులవుతున్నా ఇంకొల్లు మండలంలోని అధికారులు మొద్దు నిద్ర వీడలేదు. ఫ్లెక్సీల తొలగింపులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంకొల్లు మండలం లో స్వామిభక్తి చాటుకునేందుకు కొందరు ఎన్నికల ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారు. ఇంకొల్లులో నాగులచెరువుకట్ట మీద ఎన్టీఆర్ విగ్రహం, రైతు భరోసా కేంద్రం పక్కపక్కనే ఉన్నాయి. ఎన్టీఆర్ విగ్రహానికి ఆదివారమే ముసుగు తొడిగారు. పక్కనే ఉన్న ఆర్బీకే వైసీపీ రంగులతో దర్శనమిస్తోంది. మూడురోజులైనా పట్టించుకోని అధికారులు మంగళవారం మరోసారి ఎన్టీఆర్ విగ్రహం కింది భాగంలో పేర్లు కనిపిస్తున్నాయని వాటిని కూడా కనిపించకుండా చేసుందుకు రాగా స్థానికులు అడ్డుకున్నారు. ముందు ఆర్బీకే రంగులు తీసి మాట్లాడాలని ఎదురు ప్రశ్నించడంతో వెనుదిరిగారు.

కోడ్ ఉల్లంఘించి శిలాఫలకం ఆవిష్కరణ

- వైసీపీ ఇన్‌చార్జి హనిమిరెడ్డి సమక్షంలో ప్రజాప్రతినిధులు, నేతల అత్యుత్సాహం



గోపాలపురంలో ఆవిష్కరించిన శిలాఫలకం

అద్దంకి, మార్చి 19 : వైసీపీ నేతలు యదేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. మండలంలోని గోపాలపురంలో మంగళవారం రాత్రి అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోకుండా ఈ నెల 7వ తేదీ పేరుతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి మంగళవారం రాత్రి వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చిన హనిమిరెడ్డి సమక్షంలో ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పల్లెపల్లెకు కార్యక్రమంలో భాగంగా హనిమిరెడ్డి గోపాలపురంలో పర్యటించారు. అదే సమయం లో శిలాఫలకాన్ని స్థానిక నేతలు ఆవిష్కరించారు. హనిమిరెడ్డి మాత్రం శిలాఫలకం ఆవిష్కరణ దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది. పాత తేదీతో ఉన్న శిలాఫలకాన్ని ఆవిష్కరించడం చర్చనీయాంశంగా మారింది. అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది.

రూ.లక్ష ఆర్థిక సాయం

చీరాల, మార్చి 19 : వాసవీ క్లబ్ సీనియర్ సిటిజన్స్ విభాగం సభ్యుడు ఎం.వెంకటసుబ్బారావు మృతి చెందిగా ఆయన కుటుంబ సభ్యులు శారద నాగలక్ష్మికి క్లబ్ ప్రతినిధులు మంగళవారం రూ. 1లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తాము అందిస్తున్న చేయూత వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

విచక్షణారహితంగా చెట్ల నరికివేత

చినగంజాం, మార్చి 19 : మండలంలోని చినగంజాం, కడవకుదుకు ఆర్ అండ్‌బీ రహదారి పక్కన ఉన్న చెట్లను విచక్షణారహితంగా నరికి వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వంద ఏళ్ల నాడు వేసిన మొక్కలు పెరిగి పెద్దవై ఇటుగా వెళ్లే పాదచారులకు, వాహనదారులకు నీడనిస్తున్నాయి. చిన గంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కడవకుదురు, చింతగుంపల్లి, గొనసపూడి గ్రామాల వారికి 24 గంటలు త్రీ ఫేస్ విద్యుత్ కోసం నూతనంగా విద్యుత్ లైన్‌ను వేస్తున్నారు. ఆ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయిన్న నెపంతో రహదారి పక్కనే ఉన్న చింత, నిద్రగన్నేరు చెట్లను నరికి వేశారు. ఎప్పటి నుండో ఉన్న చెట్లను నరికి వేమడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెట్లు నరకకుండా విద్యుత్ లైను వేసే మార్గం ఉన్నా చేయలేదని అంటున్నారు. నీరు, చెట్టు చట్టం ప్రకారం చెట్లను నరికివేయాలంటే సంబంధిత అధికారుల అనుమతి అవసరం. కానీ అవేమీ పట్టించుకోకుండా చెట్లను నరికి వేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భారీ చింత చెట్టును నరికివేసిన సిబ్బంది



విజేత జట్టుతో సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

వాలీబాల్ జట్టు సభ్యులకు అభినందనలు

చీరాల, మార్చి 19 : ఇటీవల గుంటూరులోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇజినీరింగ్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన నోవమ్-2024 సందర్భంగా జాతీయ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన జట్టు విజేలుగా నిలిచారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను వారు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకమైన వివాదాలతో అశాంతి : ఆర్డీవో

చీరాలటౌన్, మార్చి 19 : పట్టణంలో ఉద్దేశపూర్వకమైన వివాదాలతో అశాంతి వాతావరణం నెలకొల్పవద్దని చీరాల ఆర్డీవో జీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో హిజ్రాలకు చెందిన రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదాలు తారస్థాయికి చేరి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలో విసిగిపోయిన పోలీసులు హిజ్రాలకు సంబంధించిన కేసును ఆర్డీవో కోర్టుకు పంపారు. దీంతో ఓ వర్గంతో మంగళవారం ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని హెచ్చరించారు. అందరూ సహనంతో సమస్యలకు దూరంగా ఉండాలన్నారు. రెండో వర్గంతో కూడా వెంటనే మాట్లాడనున్నట్లు వివరించారు. పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, హిజ్రాలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించకుంటే చర్యలు

గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ. మార్చి 19 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిబంధనలను పక్కాగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో హనుమారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ఎన్నికల నియామవళికి తిలోధకాలు అనే వార్తపై ఆయన స్పందించారురు. మండలంలోని కొణిదెన, గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాలలో మంగళవారం ఎంపీడీవో పర్యటించారు. గ్రామాలలో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను, జెండాలను, ఫ్లెక్సీలను దగ్గరుండి తొలగింపచేశారు. కొణిదెనలో ఉన్న విశ్రాంతి బల్లలకు పేర్లు కనిపించకుండా రంగు వేయించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు గ్రామాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. కొత్తగా ఎక్కడైనా పనులు ప్రారంభించినా, ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసినా ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. అలానే రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. సొంత ఇళ్లపై పార్టీ జెండాలను ఏర్పాటు చేయకూడదని ఎవరైన పెడితే అభ్యర్థి ఖర్చు కింద పడుతుందన్నారు. ఉద్యోగులు కూడా రాజకీయ పార్టీల సమావేశాలలో పాల్గొనవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఈసీకి ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో తెలిపారు. ఆయనవెంట కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కోటేశ్వరరావు, వీఆర్వో నాగేశ్వరరావు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం



తెగిపోయిన క్రేన్

బల్లికురవ. మార్చి 19 : మండలంలోని వేమవరం గ్రామం వద్ద ఉన్న ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో సోమవారం రాత్రి ముడిరాయిని కట్ చేసేందుకు పైకి లేపుతుండగా క్రేన్ ఒక్కసారిగా కుప్ప కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పనులు చేస్తున్న కార్మికులు ఉపిరి పీల్చుకొన్నారు. క్వారీల నుంచి తీసుకు వచ్చిన రాయిని పైకి ఎత్తుగా లేపటం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఫ్యాక్టరీలో క్రేన్ పడి పోవడంతో అలా ఎందుకు జరిగి ఉంటుందని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

మార్టూరులో దేవాలయాల బజారు

- 22న కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠ
- ఆ వీధిలో ఆధ్యాత్మిక శోభ



22న ప్రతిష్ఠకు సిద్ధంగా వాసవీమాత ఆలయం



మార్టూరులోని దేవాలయాల బజార్

మార్టూరు, మార్చి 19 : ఒకే వీధిలో ఏడు గురు దేవతామూర్తులు లకు చెందిన దేవాలయాలు మార్టూరులో భక్తులకు దర్శనమీయనున్నాయి. మార్టూరులో బొడ్డురాయి సెంటర్‌కు దక్షిణాన ఉన్న బజారు దేవాలయాల బజారుగా చరిత్రలో నిలిచిపోనున్నది. రోజూ భక్తి పారవశ్యంతో ఈ వీధిలోని దేవాలయాలకు భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తుంటారు. ఈ నెల 22వతేదీ శుక్రవారం సురు రూ.2కోట్లతో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అ మ్మవారి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తి పారవశ్యంతో నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సం బంధించి బుధవారం నుంచి ఈ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను, యజ్ఞాలు, హోమాలను నిర్వహించనున్నారు. గురు, శుక్రవారాలు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరుగనుంది. ఈ వీధిలో చెన్నకేశవ స్వామితో పాటు ఆలయ ప్రాంగణంలో దక్షిణాన ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దర్శనానికి మంగళ, శనివారాలు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. సోమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో సాయిబాబా గుడి, ఆలయం పడమర వైపున పోలేరమ్మ గుడి ఉన్నది. ప్రతి గురు వారం రాత్రి సాయిబాబాకు ప్రత్యేక పూజలు ఉంటాయి. నూతనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి నిర్మాణం జరుగుతున్నది. 25వేలకు పైగా జనాభా ఉన్న మేజర్ పంచాయతీ మార్టూరులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. నిత్యం దైవనామస్మరణతో బజారు వీధి మారుమోగనుంది.



గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామాల్లో పోలీసుల కవాతు

అద్దంకి, మార్చి19 : ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహణ కోసం మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పోలీసులు, బీఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. మండలంలోని ధర్మవరం, శంకవరప్పాడు, కలవకూరు, గుర్రంవారిపాలంలో సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు.

ఎన్నికలకు సహకరించాలి

బల్లికురవ : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా జరిగేలా ప్రజలు సహకరించాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు కోరారు. మంగళవారం మండలంలోని కొప్పెరపాడు, కూకట్లపల్లి గ్రామాలలో ప్రత్యేక పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ఘర్షణలకు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయని చట్టాలు కఠీనంగా ఉన్న విషయం ప్రజలు తెలుసుకోవాలన్నారు. అలానే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియెగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగ శివారెడ్డి ఉన్నారు.

నేడు తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం

అద్దంకి, మార్చి19: శింగరకొండ లక్ష్మీనర శింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69 వ వార్షిక తిరుణాళ్ళు ఏర్పాట్లు పై రెండవ విడత కో ఆర్డినేషన్ సమావేశం బుధవారం సాయం త్రం 3 గంటలకు చీరాల ఆర్‌డిఓ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఈఓ సుభ ద్ర ఒక ప్రకటన లో తెలిపారు.



పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్

టీడీపీ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల, మార్చి 19 : చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ అని, ఆయన తిరిగి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజల సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని దేవాంగపురి గ్రామ పార్టీ అధ్యక్షుడు పృధ్వీ లలితామోహన్, వ్యాపారవేత్త సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌కు సం బంధించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇం టింటికీ తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి పట్టాభిషేక మహోత్సవాలు

చినగంజాం, మార్చి 19 : పెదగంజాం గ్రామంలోని భూ నీళా సమేత భావసారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి శ్రీ రామకోటి 18వ (అష్టాదశ) వార్షిక పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ అట్ల రోశిరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీ నుంచి 30 వరకు దీపారాధన (అఖండం) హరే రామ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెదగంజాం గ్రామ భజన బృందాలు, పరిసర గ్రామ భజన బృందాల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ భావ దేవ భక్త సమాజం సభ్యులు తెలిపారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన డీఎఫ్‌వో



సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను వదులుతున్న డీఎఫ్‌వో భీమయ్య

చినగంజాం, మార్చి 19 : మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడుచెట్లపాలెం సముద్ర తీరంలో ట్రీ ఫౌండేషన్ ఐటీసీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని డీఎఫ్‌వో ఎల్.భీమయ్య మంగళవారం సందర్శించారు. ఆయన అటవీ శాఖ అధికారులతో కలిసి 109 తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి సురక్షితంగా వదిలారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో భీమయ్య మాట్లాడుతూ సముద్ర తాబేళ్లు, మడ మొక్కలు మత్స్యకార గ్రామాలకు, మత్స్యకారులకు సంరక్షకుల మిత్రులన్నారు. వాటికి ఏ విధమైనా భంగం కల్పించాలని చూసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సముద్ర తా బేళ్లు బయటకు వచ్చినప్పుడు ఎవరైనా చూస్తే తాబేళ్ల సంరక్షకులకు తెలియజేయాలని సూ చించారు. సంరక్షణ కేంద్రంలో ఉన్న 1612 పిల్లలను సముద్రంలోనికి సురక్షితంగా వదలి పెట్టాలని అన్నారు. కేంద్రం సంరక్షకులకు ఆయన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి వై.జాన్సన్, ఎఫ్‌బీవో శిరీష, వన సంరక్షణ సమితి అధ్యక్షులు దైవాల రామకృష్ణారెడ్డి, ట్రీ ఫౌండేషన్ ఉమ్మడిజిల్లాల సమన్వయకర్త శవ సం చంద్రారెడ్డి, కుంకుడుచెట్లపాలెం, రామచంద్రాపురం సముద్ర తాబేళ్ల సంరక్షకులు కా రాని శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, జాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.